ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 సెప్టెంబరు 2024



కొల్లూరు: వరద నీటిలో చిక్కుకుని దెబ్బతింటున్న మామిడి మొక్కలు

కృష్ణమ్మ కన్నెర్ర నుంచి ప్రజలు కోలుకుంటున్నారు. ముంపు నుంచి లంకలు, తీర ప్రాంత గ్రామాలు తేరుకుంటున్నాయి. వరదలతో ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందిన వారు ఇళ్లకు చేరుకుంటున్నారు. పేరుకుపోయిన బురద, కోల్పోయిన ఆస్తులను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. కృష్ణమ్మ బీభత్సంతో అపారనష్టం నెలకొంది. సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నష్టాల అంచనాలకు ప్రత్యేక బృందాలను ప్రభుత్వం రంగంలోకి దింపింది. పంటలు, ఆస్తుల పరిశీలనలో ఆయా బృందాలు నిమగ్నమయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేవలం వరి పంట ఒక్కటే 1,88,363 ఎకరాల్లో దెబ్బతిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అంచనాలకు అందని విధంగా లంక గ్రామాలు భారీ నష్టాన్ని చవిచూశాయి. కొన్ని లోతట్టు ప్రాంతాలు వరద ముంపులోనే ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలన్నీ చెత్తా చెదారాలతో నిండి పోగా పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

వీడిన వరద..

ఇళ్లకు జనం

- తేరుకుంటున్న లంక గ్రామాలు
- నష్టంపై అంచనాల్లో ప్రత్యేక బృందాలు
- రూ.వెయ్యి కోట్లకుపైగానే పంటలు కృష్ణార్పణం
- ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం
- వాణిజ్య పంటలు ఒక్క ఎకరా దక్కదని రైతన్న ఆవేదన
- సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం ఎదురుచూపు



రేపల్లె: వెల్లటూరు సమీపంలో వరద తాకిడికి కుళ్లిపోయిన పసుపు దుంపలను చూపెడుతున్న రైతు

రేపల్లె/ తెనాలి, బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు బారిన పడిన గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. కృష్ణమ్మ కరుణించటంతో వరద తగ్గుముఖం పట్టింది. తీర ప్రాంత వాసులు కొంతమేర భయాన్ని వీడి ముప్పు నుంచి బయటపడ్డ గ్రామాల్లోకి పయనమవుతున్నారు. కృష్ణమ్మ మహోగ్రంతో అతలాకుతలమైన లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. కృష్ణమ్మ కన్నెర్రతో ఐదు రోజులుగా నీటిలో మునిగిపోయిన గృహాలను చూసుకునేందుకు ప్రజలు గురువారం తరలివచ్చారు. కరకట్టవెంబడి ఉన్న గ్రామాల్లోని ప్రజలు సామగ్రిని తీసుకుని గృహాలకు పయనమయ్యారు. గృహాలు కోల్పోవటంతో ఎక్కడ ఉండాలా అని ఆలోచనలో పడ్డారు. గురువారం ఉదయం బాపట్ల, కొల్లూరు, రేపల్లె మండలాల్లో కురిసిన వర్షం ఆయా గ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేసింది. అయితే కొద్దిసేపటికే ఐదు రోజులుగా మాయమైన ఎండ జాడ కానరావడంతో ఊపిరి పీల్చుకున్నారు. వరద వీడటంతో చోటుచేసుకున్న నష్టం వెలుగు చూస్తోంది. ప్రభుత్వ, ప్రజల ఆస్తులు భారీగా దెబ్బతిన్నాయి. లంక గ్రామాల్లో రహదారులు చాలా చోట్ల వరద ఉధృతికి కోతకు గురయ్యాయి. వరద పంటలతో పాటుగా గృహాల మీద నుంచి ప్రవహించడంతో కనివినీ ఎరుగని రీతిలో ప్రజలు నష్టపోయారు. సన్న చిన్నకారు కూలీ చేసుకునే కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలు నేల కొరగటంతో కన్నీటిపర్యంతమయ్యారు. వరద వల్ల కొట్టుకు వచ్చిన వ్యర్థాలన్నీ ఆయా గ్రామాలు, లంకల్లోని రోడ్లపైన దర్శనమిస్తున్నాయి. డ్రిప్‌పైపులతో పాటు తాడి చెట్లు, అరటి చెట్లు రహదారుల వెంట పొలాల్లో దర్శనమిస్తున్నాయి. వీటన్నింటిని తొలగించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశుధ్య సిబ్బంది సరిపోవడం లేదు. వాణిజ్య పంటలు ఉరకెత్తిపోయి రూపురేఖలు కోల్పోతున్నాయి. అరటి తమలపాకు, బొప్పాయి, పసుపు, కంద పంటలలో వరద నీరు ఇంకా బయటకు వెళ్లలేదు. ఆయా తోటల్లో నీరు బయటకు వెళ్లాలంటే రహదారులకు గండి కొట్టాల్సిందేనని రైతులు పేర్కొంటున్నారు. లంకల్లో ఉద్యాన పంటలు ఏమీ మిగలలేదు. చేతికందివచ్చే దశలో ఉన్న పంటలు కూడా నీటిపాలయ్యాయి. మొత్తం మీద రూ.వెయ్యికోట్లపైనే పంటల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నష్టం అంచనాలు తేలితే ఇది రెట్టింపు ఉంటుందనేది రైతుల వాదన. ప్రకాశం బ్యారేజి దిగువున కేవలం రెండు మండలాల్లో ఉద్యాన పంటల నష్టం అంచనా వేస్తేనే రూ.100 కోట్లపైన ఉందంటే, బ్యారేజి ఎగువున, దిగువునున్న మిగిలిన మండలాల్లో లెక్కకడితే దీనికి మూడురెట్లు పెరగొచ్చనేది అంచనా. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేవలం వరి ఒక్కటే 1,88,363 ఎకరాల్లో దెబ్బతిందని అంచనా వేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అరటి, కంద, పసుపు, తమలపాకు, జామ తోటలు మొత్తం 8,535 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా. వాణిజ్య పంటలు 90 శాతం వరకు పెట్టుబడులు పెట్టేసి, దిగుబడి కోసం ఎదురుచూస్తుంటే, వరికి కూడా సగంపైనే పెట్టుబడులు పెట్టేశారు. కరకట్ట వెంబడి ఉన్న పెనుమూడి, మైనేనివారిపాలెం, లంకేవానిదిబ్బ ఎస్టీ కాలనీ పూర్తిగా గృహాలు దెబ్బతిన్నాయి. మోర్తోటముక్తేశ్వరస్వామి దేవాలయం వరద తాకిడికి ముందుభాగమంతా కొట్టుకుపోయి ముఖమండపం దెబ్బతింది. రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి పల్లెపాలెం, రావిఅనంతవరం, వేణుగోపాలస్వామిగుడి, వెల్లటూరు లంకగ్రామాలు అరటితోటలు వరద ముంపు నుంచి బయటపడ్డాయి.

నష్టం అంచనాల్లో నిమగ్నం..

వరదలు తగ్గుముఖం పట్టి ముంపులో ఉన్న పొలాలు, ఊళ్లు బయటపడుతుండడంతో క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలకు సర్వే బృందాలను ప్రభుత్వం రంగంలోకి దించింది. ఆస్తులు, పంటలకు జరిగిన నష్టం అంచనాల గణనకు ప్రత్యేక బృందాలు శాఖల వారీగా రంగంలోకి దిగాయి. ఇళ్లలో జరిగిన నష్టానికి సంబంధించి రెవెన్యూ యంత్రాంగం ఇంటింటికి తిరిగి లెక్కలు వేస్తుండగా, పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖలు సేకరిస్తున్నాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా 151 గ్రామాలకు గాను 151 బృందాలు పంట నష్టం గణనకు పనిచేయనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముంపు బారి నుంచి వ్యవసాయ, ఉద్యాన పంటలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఉద్యాన పంటలు ఒక్క ఎకరం కూడా దక్కవని రైతులు చెబుతుంటే, పల్లపు ప్రాంతాల్లోని వరి పంట పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను తొలగించడానికి అదనపు ఖర్చవుతుంటే, రెండో పంట వేసుకోవడానికి మళ్ళీ పెట్టుబడి అవసరం ఉంటుంది. వేమూరు మండల పరిధిలో ఐదు రోజుల నుంచి పొలాల్లోనే నీరు ఉండటంతో వరి నాట్లు పూర్తిగా కుళ్ళిపోయాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..

లంక గ్రామాలతో పాటు వరద ముంపునకు గురైన ప్రాంతాలన్నీ దాదాపుగా తేరుకోవడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. వరద ప్రవాహం తగ్గిన ప్రాంతాల్లో ఇళ్లు,రోడ్లు శుభ్రం చేసేందుకు పెద్ద ఎత్తున సిబ్బంది రంగంలోకి దిగారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు తాగునీటి విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని కూడా గ్రామాల్లో మోహరించి ఇంటింటి ఆరోగ్య సర్వే కూడా చేపడుతున్నారు. పారిశుధ్య పనులపై ఫిర్యాదుల నేపథ్యంలో బాపట్ల కలెక్టర్ స్వయంగా కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు.

బాబు భరోసా కోసం..

● లంక గ్రామాల్లో పర్యటించనున్న సీఎం

నిండా మునిగి.. సర్వం కోల్పోయి.. సాయం కోసం కృష్ణమ్మ వరద బాధితులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రెక్కల కష్టం, ఏళ్లుగా కూడబెట్టుకున్న ఆస్తులతో పాటు తిండి గింజలు, నిత్యావసరాలను కృష్ణమ్మ మింగేయగా కట్టుబట్టలతో నిరాశ్రయులైనవారు ఎందరో. ఇలాంటి వారందరూ మళ్లీ బతికి బట్టకట్టాలంటే ప్రభుత్వ సాయం తప్పనిసరి. కృష్ణా తీరంలో వరదలకు పంటలు, ఊళ్లకు ఊళ్ళు మునిగిపోయిన నేపథ్యంలో బాధితులకు భరోసా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు లంక గ్రామాల పర్యటనకు రానున్నారు. పర్యటన సందర్భంగా సాయం ప్రకటించే అవకాశం ఉంది. అయితే నిండా మునిగిన తమకు ఉదారంగా సాయం చేయాలని చంద్రబాబును బాధితులు వేడుకుంటున్నారు. రెండో పంట వేయడానికి ప్రోత్సాహం అవసరమని, లేకుంటే మళ్లీ సాగు చేపట్టలేమని కన్నీటి పర్యంతమవుతున్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వారిని ఆదుకోవాలని కోరుతున్నారు. చేతికంది వచ్చిన పంటలతో పాటు ఇప్పటికే వేలల్లో పెట్టుబడితో వేసిన పంటలు దక్కలేదని, ఈ పరిస్థితుల్లో పెట్టుబడితో పాటు రాయితీ కావాలంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై ఇస్తే మళ్లీ పంట వేయగలుగుతామని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం

● రైతులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఊహించని భారీ విపత్తు.. భారీ నష్టం వాటిల్లింది. భారీ పెట్టుబడి పెట్టి, పంట చేతికందే దశలో నీటిపాలైంది.. అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం.. అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు హామీ ఇచ్చారు. గురువారం కొల్లిపర, మండలంలో ఆయన పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం గురించి తెలుసుకున్నారు. జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. పంట నష్టంతోపాటు, విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేందుకు కేంద్ర సాయాన్ని కోరతానన్నారు.



కొల్లిపర: వల్లభాపురంలో వరదకు పసుపు దెబ్బతిందని కేంద్ర మంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటికి తెలుపుతున్న రైతులు



సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ. కోటి విరాళం అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



కొల్లూరు: వరద ఉధృతికి కోతకు గురైన రహదారి



కొల్లూరు: వరద ఉధృతికి నేలవాలిన కంద పైరు



రేపల్లె: పెనుమూడి పల్లెపాలెంలో గృహం పూర్తిగా వరదలో కొట్టుకుపోవటంతో రోడ్డుపైనే జీవనం సాగిస్తున్న కుటుంబం



రేపల్లె మండలం రావిఅనంతవరం సమీపంలో వరద తాకిడికి మాడి పోయిన బొప్పాయితోట



భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో నీటి ప్రవాహానికి మాడిపోయిన కాకర, బీర, సొరపాదులు



రేపల్లె: వరద పోటు కారణంగా చిధ్రమైన మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



కొల్లూరు: వరద ఉధృతికి విత్తనంతో సహా బయటపడ్డ పసుపు పైరు



కొల్లూరు: పసుపు పైరును వీడని వరద ముంపు



రేపల్లె: రావిఅనంతవరంలో వరద సమయంలో నాడు నీటమునిగిన వేణుగోపాలస్వామిగుడి



నేడు వరద తగ్గటంతో బయటపడ్డ వేణుగోపాలస్వామి గుడి

నేడు వేమూరుకు చంద్రబాబు?

వేమూరు: కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం వేమూరు నియోజకవర్గానికి రానున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి గురువారం వస్తారని తొలుత భావించిన అధికారులు వేమూరు మార్కెట్ యార్డు సమీపంలో హెలీప్యాడ్‌పై దిగేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణం అనుకూలించని కారణంగా ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడింది. అయితే శుక్రవారం చంద్రబాబు వస్తారన్న ఉద్దేశంతో వేమూరులోని హెలీప్యాడ్ వద్ద మార్కింగ్ చేసి సమీపంలో అధికారులు జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో నీట మునిగిన పైర్లను పరిశీలించి, బాధిత కుటుంబాలను చంద్రబాబు పరామర్శించనున్నారు. అనంతరం రాత్రికి వేమూరులో బస చేసి శనివారం ఉదయం రేపల్లె పర్యటనకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



వేమూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్



వెల్లటూరు లంకగ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారి నాడు జలమయం



వరద తగ్గటంతో బయటపడిన వెల్లటూరు లంక గ్రామాలకు వెళ్ళే రహదారి



కొల్లూరు: రావిఅనంతవరంలో నాడు వరదనీటిలో నానుతున్న అరటితోట



నేడు వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ అరటితోట

చీటింగ్ కేసు..

నకిలీ నోట్లు గుర్తింపు

● నిందితుల నుంచి 19 లక్షల కరెన్సీ స్వాధీనం

చీరాలటౌన్, సెప్టెంబరు 5: ఓ చీటింగ్ కేసులో నిందితులను విచారించగా నకిలీ నోట్ల వ్యవహారం వెలుగుచూసింది. చీరాల మండలం ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గురువారం డీఎస్పీ జగదీష్‌నాయక్ తెలిపిన వివరాలు.. వేటపాలెం మండలం పుల్లరిపాలెం పంచాయతీ కొత్తరెడ్డిపాలేనికి చెందిన సూరిన పోలిరెడ్డి పదో తరగతి పూర్తిచేసి ఆటో నడుపుకుంటున్నాడు. జూన్ 12న ఓ నంబరు నుంచి ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు చీరాల ఐటీసీ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, అందుకు ముందుగా రూ.1.50 లక్షలు చెల్లించాలని పోలిరెడ్డికి తెలిపారు. ఇది నిజమేనని నమ్మిన అతడు అదే రోజు చీరాల మండలం వాడరేవు పంచాయతీ వైఎస్సార్‌కాలనీలోని రాగిరి శివమల్లికార్జున్, పాలపర్తి సాయి, బెల్లంకొండ రాము దగ్గరకు వెళ్లాడు. వారు అతడ్ని ఓ ఇంట్లో తీసుకెళ్లి నగదు తీసుకున్నారు. ఈలోగా మరో ఇద్దరు పోలీసుల్లా లోనికి వచ్చి అక్కడ ఉన్న వారందరినీ బెదిరించి దొంగ నోట్లు మారుస్తున్నారా అంటూ పోలిరెడ్డిని కొట్టి నగదు తీసుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనపై పోలిరెడ్డి ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శివకుమార్ వైఎస్సార్ కాలనీకి చెందిన ముగ్గురితోపాటు నెల్లూరుకు చెందిన గుత్తి భరత్‌ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో వారిని విచారించగా వారి వద్ద రూ.19 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన నగదులో రూ.లక్ష రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో వెదుళ్లపల్లికి చెందిన పోలా హరీష్, కరీంనగర్‌కు చెందిన కౌషిక్‌లు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.



నకిలీ కరెన్సీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్ నాయక్

అత్యుత్తమమైనది ఉపాధ్యాయ వృత్తి

● గురు పూజోత్సవంలో ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, సెప్టెంబరు 5: అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయవృత్తి అత్యుత్తమైనదని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక అన్నం సతీష్ ప్రభాకర్ కాపుకల్యాణ మండపంలో గురువారం జిల్లా విద్యాశాఖా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల పంపిణీ చేసి సత్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు ఆ వృత్తి గురించి పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. చివరి బెంచీలో ఉండే విద్యార్థి గురించి పట్టించుకుని, వారికి చదువు చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దే గురువులు ఉత్తములన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత పిల్లల బాధ్యత ఎక్కువగా తీసుకుని వారిని సన్మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులేనన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు గురి కాకుండా మంచి మార్గంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, డిప్యూటీ డీఈవోలు జి.వెంకటేశ్వర్లు, నజ్మాఖాతూన్, ఎంఈవోలు ఎస్.నిరంజన్, ప్రసాదరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య తదితరులు





పదిహేనేళ్ల ప్రయాణం

అక్కినేని నాగచైతన్య తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదిహేనేళ్ల అయింది. ఆయన నటించిన తొలి చిత్రం 'జోష్' 2009 సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ పదిహేనేళ్ల ప్రయాణంలో విలక్షణమైన పాత్రలు ఎన్నో పోషించి, మంచి నటుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ చిత్ర యూనిట్ ప్రత్యేకమైన పోస్టర్ విడుదల చేసింది. సముద్రం దగ్గర ఫిషింగ్ బోట్ మీద నిల్చుని చిరునవ్వు చిందిస్తున్న చైతు లుక్ ఆకట్టుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత.

ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం


డి.సురేశ్‌బాబు



తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరఫున రూ.25 లక్షలు.. నిర్మాతల తరఫున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరఫున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరఫున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరఫున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు

32వ సినిమా విడుదలకు ముహూర్తం



విభిన్న కథాంశాలు ఎన్నుకొని వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న నాని తన 32వ చిత్రం వివరాలు గురువారం ప్రకటించారు. 'హిట్ 3' చిత్రంలో తన లుక్‌ని, గ్లింప్స్‌ను విడుదల చేశారు. డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. సిగార్ తాగుతూ, కారు నడుపుతూ రక్తపు చేతులు, గొడ్డలితో ఫెరోషియస్‌గా కనిపించారు నాని. 'హిట్ 3'లో ఆయన అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 2025 వేసవి సందర్భంగా మే ఒకటిన సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. 'హిట్ 3' చిత్రానికి సాను జాన్ వర్గీస్ ఛాయాగ్రహణాన్ని, మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

వినోదాన్ని పంచే సినిమా



ఫరియా అబ్దుల్లా నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019 విడుదలై సూపర్ హిట్ అయిన 'మత్తు వదలరా' సినిమాకు సీక్వెల్. ఈ నెల 13న విడుదలవుతున్న సందర్భంగా ఫరియా మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా ఒక డిఫరెంట్ థ్రిల్లర్. ఎన్నో ట్విస్టులు, సర్‌ప్రైజ్‌లతో కూడిన కథ ఇది. ఇందులో పాత్రధారుల కష్టాల నుంచే కామెడీ పుడుతుంది. ఈ సినిమాలో సన్నిధి అనే స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తాను. నాది యాక్షన్‌తో నిండిన పాత్ర. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. కాలభైరవ ఇచ్చిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ సినిమా మొదటి భాగం కంటే మరింత వినోదాన్ని పంచుతుంది. ప్రస్తుతం తిరువీర్‌తో ఓ ప్రేమకథలో నటిస్తున్నా. త్వరలోనే ఓ తమిళ చిత్రం కూడా మొదలవ్వబోతోంది" అని ఫరియా చెప్పారు.

మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి

మంచు విష్ణు



తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాఖ్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

సంస్కృత టీచర్స్‌కు అంకితం



రచయిత, దర్శకుడు జనార్ధన మహర్షి 'శ్లోక' పేరుతో ఓ సంస్కృత చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాగిణి ద్వివేది ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని జనార్ధన మహర్షి కుమార్తెలు శ్రావణి, శర్వాణి నిర్మాతలు. ఈ సినిమా గురించి జనార్ధన మహర్షి వివరిస్తూ 'సినిమాలోని కీలకమైన రుద్రభూమి సన్నివేశాలను బెంగళూరు, మైసూర్‌లో చిత్రీకరించాం. దేశంలోని పురాతనమైన అనేక శ్మశానాలలో షూటింగ్ చేశాం. సంస్కృతంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనేక భారతీయ భాషల్లోకి అనువదిస్తాం. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మా చిత్రాన్ని సంస్కృత టీచర్స్‌కు అంకితం ఇస్తున్నాం' అని చెప్పారు. ఈ సినిమాలో తనికెళ్ల భరణి కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



యువతరానికి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రోటీ కపడా రొమాన్స్' అక్టోబరు 4న విడుదల కానుంది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. సినిమాలో ప్రతి పాత్ర యూత్‌కు కనెక్ట్ అవుతుందనీ, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ప్రధాన బలాలు అని దర్శకుడు తెలిపారు. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనీ, అది ఈ రేంజ్ అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారనీ నిర్మాతలు చెప్పారు.

స్పీడ్‌గా..



గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవి నటించిన 'స్పీడ్ 220' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోలిద్దరూ పోటీ పడి నటించారనీ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా అలరించే విధంగా సినిమా ఉంటుందని దర్శకుడు హర్ష బేజాగం తెలిపారు. కె.ఫణి, ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు ఈ సినిమాను నిర్మించారు.



కొల్లిపరలో పంటనష్టం వివరాలను అధికారులను అడిగితెలుసుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజా

దెబ్బతిన్న ప్రతి రైతును ప్రభుత్వాలు ఆదుకుంటాయి

కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కొల్లిపర, సెప్టెంబరు 5 : రైతుల కష్టాన్ని వెలకట్టలేమని, వరదలకు రైతులు నష్టపోవడం బాధాకరమని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలు అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం గ్రామాల్లో ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రకృతి విపత్తు వల్ల తలెత్తిన నష్టం తదితర అంశాలపై రైతులతో చర్చించారు. అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖలు వ్యవసాయ, డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో వరదకు, భారీ వర్షాలకు ఎంత నష్టం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ బుకింగ్, బీమా తదితర చర్యల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే కాంపోనెంట్, సబ్సిడీ, బీమా తదితర ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత వరద నష్టం సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సహాయ చర్యలు చేపడతామన్నారు. వరదకు దెబ్బతిన్న ప్రతి రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోనున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరద కారణంగా లంకగ్రామాల్లో పంట నష్టం తీవ్రంగా జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన లంక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటి రెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సహాయనిధికి రూ. 28,40,710 విరాళాలు

గుంటూరు, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద బాధితుల సహాయార్థం పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం అందిం చేందుకు ముందుకొచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని వారు కలిసి విరాళాలను అందజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ. లక్ష, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ రూ. 10 వేలు, బొమ్మిడాల శ్రీకృష్ణ మూర్తి ఫౌం డేషన్ రూ. 5 లక్షలు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ రూ.1,70,710, నరేడ్కో క్యాపిటల్ జోన్ ఆంధ్రప్రదేశ్ రూ.10 లక్షలు, చెలికాని సీతారామయ్య ఆర్గానిక్స్-గుంటూరు రూ. 10 వేలు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్-అమరావతిరూ. 5 లక్షలు, శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్ రూ. లక్ష, వివా ది స్కూల్-నంబూర్ రూ. లక్ష, నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ రూ.లక్ష, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ రూ.50 వేలు, టాప్ కిడ్స్ స్కూల్ రూ. లక్ష, స్టెమ్ స్కూల్ రూ. లక్ష కలిపి మొత్తం గురు వారం నాటికి రూ. 28,40,710 కలెక్టర్ సహాయనిధికి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను అభినందించారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ సభ్యులు



కలెక్టర్‌కు విరాళాలు అందజేసిన పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు

సింథటిక్ కంపెనీ రూ.10 లక్షలు అందజేత

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : వరద బాధితులకు అత్యవసర సాయం కింద రూ.10 లక్షలు విరాళాన్ని అందించడం అభినందనీయమని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. గురువారం ప్రకాశం జిల్లా మేదరమెట్లకు చెందిన సింథటిక్ కంపెనీ యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించింది. సంస్థ సీనియర్ మేనేజర్ అబ్దుల్ సలాంతో ఆ చెక్కును కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి మరో రూ.90 లక్షలు ఇవ్వడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.



బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళికి చెక్కు అందజేస్తున్న అబ్దుల్ సలాం

మల్లెల రాజేష్ నాయుడు విరాళం రూ.10 లక్షలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, తెలుగుదేశం నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు గురువారం రు.10 లక్షల విరాళాన్ని ప్రక టించారు. ఆయన తన విరాళపు చెక్కును రాష్ట్ర మంత్రి లోకేష్ కు అందజేశారు. రాజేష్ నాయుడును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.



విరాళపు చెక్కును మంత్రి లోకేష్ కు అందచేస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

గుడిపూడి గ్రామస్తుల సాయం పదిలక్షలు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితుల కోసం మండ లంలోని గుడిపూడి గ్రామస్తులు తమ దాతృత్వాన్ని చాటు కున్నారు. సుమారు రూ 10 లక్షలను సేకరించి ఈ మొత్తం సహాయాన్ని చెక్కు రూపంలో గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయనకు అంద జేశారు. సహాయం అందించిన వారిలో గ్రామానికి చెందిన చిగురుపాటి సాంబశివరావు రూ5 లక్షలు, సంగం డెయిరీ పాల కేంద్రం ద్వారా రూ 50వేలు, గ్రామంలోని ఐదు డ్వాక్రా సంఘాల ద్వారా రూ 50వేలు, మిగిలిన మొత్తాన్ని గ్రామస్తుల ద్వారా సేకరించి మొత్తం రూ 10 లక్షలను సీఎం చంద్రబాబుకు అంద జేశారు. కార్యక్రమంలో జి.అప్పారావు, ఎల్. గజానన, కె.పుల్లారావు, జి.అచ్యుత రామయ్య, జి.తాతారావు, జి.ఆంజనేయులు, ఎస్. శ్రీనివాసరావు, చిగురుపాటి సాంబయ్య, అమరనేని సుధాకర్ ఉన్నారు. ఈ మొత్తం ఆర్థిక సాయాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు సేకరించి వరద బాధితుల సహా యార్థం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



రూ. 50 లక్షల చెక్కుని కలెక్టర్‌కు అందజేస్తున్న డ్వాక్రా గ్రూపుల మహిళలు, డీఆర్‌డీఏ, లీడ్‌బ్యాంకు అధికారులు

డ్వాక్రా గ్రూపుల మహిళల ఉదారత

- వరద బాధితులకు రూ. 50 లక్షల సాయం అందజేత
- మెప్మా ద్వారా మరో రూ. 30 లక్షలు

గుంటూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయనిధికి జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు తమ ఉదారతను చాటుకొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా, డ్వాక్వా గ్రూపుల మహిళలు భారీగా విరాళాలు సేకరించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ - వెలుగు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.50 లక్షలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - వెలుగు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ. 30 లక్షల చెక్కులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహర నాద్, లీడ్ డిస్ట్రిక్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, స్వయంసహాయక సంఘాల సభ్యులు అందించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ హరిహరనాద్ మాట్లాడుతూ జిల్లాలో డీఆర్‌డీఏ పరిధిలోని 20,632 స్వయం సహాయక సంఘాలు, మెప్మా పరిధిలోని 19,118 స్వయం సహాయక సంఘాలు వరదబాధితుల సహాయ నిధికి రూ. 1.25 కోట్లు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మిగతా ఆర్థిక సహాయం సోమవారం అంది స్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు ఎస్అశోక్, రాంబాబు, నారాయణ, ఉషా, కీర్తి పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

నేటి నుంచి కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమ్మె

- జీఎన్ఎం చేసిన వారికి పోస్టులు ఇవ్వడంపై ఆగ్రహం



గుంటూరు జీజీహెచ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 5 : రాష్ట్రంలో ని వివిధ ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు మెరుపు సమ్మె కు దిగనున్నారు. శుక్రవారం నుండి తాము విధులకు హాజరు కాబోమంటూ డీడీలు,ఆసుపత్రి సూపరింటెండెంట్‌లకు గురువారం నోటీసులు ఇచ్చారు. ఏఎన్ఎం లుగా పనిచేస్తున్న వారికి జగన్ ప్రభు త్వంలో జీఎస్ ఎం గా శిక్షణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ కోర్సు ను కుదించి శిక్షణ ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారికే రూ. ఐదువేలు అదనపు పారితోషకం గా చెల్లించి స్టాఫ్ నర్సు పోస్టు ల్లో నియ మించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తాజాగా జీఓ జారీ చేసింది. రెగ్యులర్ పోస్టు ల్లో స్టాఫ్ నర్సు పోస్టు ల్లో ఎస్ఎం శిక్షణ పొందిన వారిని నియమించడం వల్ల గత 15 ఏళ్ల గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని బాధి తులు చెబుతున్నారు. జీఓ రద్దు చేసే వరకు తాము సమ్మె చేస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో కూడా కాంట్రాక్టు స్టాఫ్ నర్సు లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

సంతకాల ఫోర్జరీపై ఫిర్యాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 5 : మునిసిపల్ కమిషనర్, సర్వేయర్ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్‌ను తయారుచేసిన సంఘటన పట్టణంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు.. సత్తెనపల్లికి చెందిన గొల్లపల్లి వెంకటరావుకు పట్టణంలోని 3,401 చదరపు గజాల ఖాళీ స్థలం పూర్వార్జితంగా సంక్రమించిందని.. దీనిని స్వాధీనం చేసుకొనేందుకు సర్టిఫికెట్ ఇప్పించాలని 2024 మార్చి 14న మునిసిపల్ కమిషనర్‌కు, సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఆ భూమి అతనిది కాదని తేలడంతో సర్వేయర్, కమిషనర్ అతనికి సర్టిఫికెట్ ఇవ్వలేదు. అయినప్పటికీ ఆ సర్వేయర్, కమిషనర్ ఆ స్థలం వెంకటరావదేనని నిర్ధారించినట్టు దొంగ సర్టిఫికెట్‌ను మార్చి 24, 2024న పుట్టించాడు. ఈ సర్టిఫికెట్‌లో సర్వేయర్, కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఈ దొంగ సర్టిఫికెట్ విషయం బుధవారం మునిసిపల్ కమిషనర్, సర్వేయర్ దృష్టికి వెళ్ళింది. ఈ సర్టిఫికెట్ తామిచ్చింది కాదని గుర్తించారు. ఈ విషయమై మునిసిల్ సర్వేయర్ షఫీ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పట్టణ సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసిన వెంకటరావు పై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పొన్నూరులో వెండి దుకాణంలో భారీ చోరీ

- స్థానికుల అప్రమత్తతో దొరికిన దొంగలు
- రూ. 30 లక్షల చోరీ సొత్తు, వాహనం చంద్రగిరిలో స్వాధీనం
- తెనాలిలో మరో ఇద్దరు అదుపులోకి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు5: దొంగతనాలు చేయడంలో ఆరితేరిన ముఠా ఓ వెండి దుకాణంలో బుధవారం అర్ధరాత్రి భారీ చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడిన సంఘటన పొన్నూరులో జరిగింది. అర్బన్ పోలీసులు, స్థానికులు, బాధితుల కథనం ప్రకారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌కు సమీపంలో తోటలమ్మ గుడి పక్కనే వెండి, బంగారు ఆభరణాల విక్రయించే ధనలక్ష్మీ జ్యూవెలర్స్ ఉంది. బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ దుకాణంలో షట్టర్లు పగలగొట్టి దుండగులు దుకాణంలోకి ప్రవేశించారు. సుమారు రూ. 30 లక్షల విలువైన 38 కిలోల వెండి అభరణాల చోరీకి పాల్పడ్డారు. చోరీ దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి.



సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యాలు

స్థానిక యువకుల అప్రమత్తతతో దుండగుల పట్టివేత

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌కు సమీపంలోని షరాఫ్ బజార్‌లో కెజిఎన్ యూత్ పండుగలు నిర్వహిస్తూ వుంటుంది. మరో రెండు రోజులో వినాయకచవితి పండుగ నేపథ్యంలో కేజీఎన్ యూత్ సభ్యులు వినాయక మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీఎన్ సభ్యులు రాత్రి వేళ మండపం నిరిస్తుండంగా సమీపంలోకి ధనలక్ష్మీ జ్యూవెలర్స్ వద్ద అలికిడి కావడం, తెల్లటి ఫార్చ్యూనర్ వాహనం హడావుడిగా రావడం.. వాహనం లోపలికి లోడింగ్ చేస్తూ గుర్తుతెలియనివ్యక్తులు ఉండటంతో .. యూత్ సభ్యులకు అనుమానం వచ్చింది. వెంటనే ఆ యువకులు అక్కడికి వెళ్లడంతో అది గమనించిన దుండగులు వాహనంలో పారిపోయేందుకు యత్నించారు. ఇద్దరు యువకులు ధైర్యం చేసి దుండగుల వాహనాన్ని



పొన్నూరు పోలీసులకు ఆభరణాలు అప్పగిస్తున్న చంద్రగిరి పోలీసులు

వెంబడించారు. దుండగుల్లో ఓ యువకుడు రతన్ సింగ్‌ని గట్టిగా పట్టుకుని బంధించే క్రమంలో వాహనంలోని మరో ఇద్దరు అతన్ని తప్పించేందుకు..వాహనం దిగి స్థానిక యువకులపైకి దాడికి యత్నించారు. దీనిని స్థానిక యువకులు ప్రతిఘటించడంతో దుండగులు పరారయ్యారు. వాహనంలోని వ్యక్తులు ఇద్దరు దొంగలను వదిలి కారులో పారిపోయారు. చోరీ సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకుల అదుపులో ఉన్న రతన్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.ఈ



పొన్నూరులో స్థానిక యువకుల అదుపులో ఉన్న రతన్‌సింగ్, చంద్రగిరిలో పోలీసులు అదుపులోకి తీసుకున్న బీహార్ దొంగలు

సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు.. చోరీ జరిగిన గంటల వ్యవధిలోనే చోరీకి ఉపయోగించిన వాహనం, చోరీ జరిగిన సొత్తు, వాహన డ్రైవర్ ముకేష్ మలీని తిరుపతి సమీపంలోని చంద్రగిరిలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చోరీలో పాలుపంచుకుని స్థానిక యువకులపై దాడికి దిగిన మరో ఇద్దరు సుమన్ కామిత్, విక్రమ్ సింగ్, ఉత్తమ్ సింగ్‌లను కూడా పోలీసులు తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో నింది తులను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ ఇద్దరు నిందితులు

నిందితుల్లో ఇద్దరు చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డారు. పొన్నూరులో చోరీ ఘటనలో కారులో పరారైన నలుగురు నిందితులను బెంగళూరుకు వెళుతున్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు గురువారం ఉదయం 10.30 గంటల సమ యంలో రాగానే టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు.

ఇద్దరు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారును పరిశీలించగా, రూ.30 లక్షల విలువైన బంగారు, వెండి, రోల్డ్ గోల్డ్ ఆభరణాలు కనిపించాయి. కారుతో పాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను, కారు, ఆభరణాలను చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గురువారం రాత్రి 10 గంటల సమయానికి చంద్రగిరికి చేరుకున్నారు. వీరికి ఇద్దరు నిందితులు, ఆభరణాలు, కారును చంద్రగిరి పోలీసులు అప్పగించారు.

డాక్టర్ సర్వేపల్లి గొప్పతత్వవేత్త

● డాక్టర్ పీసీ సాయిబాబు

భారతీయ తత్వశాస్త్ర విశిష్ఠతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిరస్మరణీయులని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి 136వ జయంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ రాష్ట్రపతి పీఠాన్ని అధిష్ఠించి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింప చేశారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమ్రుద్ బాషా, ఉపాధ్యాయులు జాన్‌వెస్లీ, మాణిక్యారావు, అనీల్, రవి, శేషాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సాఫ్ట్‌వేర్ అధినేత ఎం.శేషుకృష్ణ, లక్ష్మీప్రణతి దంపతులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రతి సంవత్సరం అనేకమంది పేదవిద్యార్థులకు ఉచితంగా సాంకేతిక విద్యనందిస్తున్నామని శేషుకృష్ణ తెలిపారు. విద్యార్థులు వారిని ఘనంగా సత్కరించి సన్మానించి కేక్ కట్ చేయించారు. ఇంజనీరింగ్, బిఫార్మశీ, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● గురుపూజోత్సవం సందర్భంగా పట్టణంలోని 8వ వార్డు అంబేద్కర్‌నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌పుస్తకాలు, పలకలు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేసి చక్కగా చదువుకోవాలని చెప్పారు. వార్డు టీడీపీ నాయకుడు చేగూడి దాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు చింతా ఏసోబు, చేగూడి మరియదాసు, దారా అశోక్, వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పట్టణంలోని 2వ వార్డు పేర్లి సునీల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, కళాశాల ఛైర్మన్ పేర్లి సునీల్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రత్నాకర్, ఆషా, సుష్మా, వాసంతి, అంజమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

● బాపట్ల రూరల్, సెప్టెంబరు 5 : డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్, డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ కెవి రామిరెడ్డి, డాక్టర్ బి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

● బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. గణితశాస్త్ర విభాగంలో అమూల్యమైన సేవలందిస్తున్న ఉత్తమ అధ్యాపకులు నాళం కరుణాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు డాక్టర్ ఎన్.శ్రీనివాసరావును సన్మానిస్తున్న హైవెండ్ హైస్కూల్ ఎండీ తదితరులు

● కర్లపాలెం, సెప్టెంబరు 5 : స్థానిక హైవెండ్ హై స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయులు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావును దుశ్శాలువా, పూలమాలలతో యాజమాన్యం ఘనంగా సన్మానించారు. అలాగే ఎండీ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ చాంధిని, ఉదయచంద్రరావు, ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 5 : మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీలోని నత్తలవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో, గ్రంథాలయాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

● పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామపంచాయతీ నదీముల్లాయపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహబూబ్ సుభానీ జ్ఞాపకార్థం వారి కుమారులు ఫైజుద్దీన్, మక్బుల్‌లు విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ రహంతుల్లా, ఉపాధ్యాయుడు ఖాశీం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, సెప్టెంబరు 3 : వేమూరు మండల పరిధి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వరహాపురం, కుచ్చెళ్ళపాడు, చావలి, పెరవలి, జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పద్మజదీన దయాల్ అంకారావు, శ్రీనివాసరావు, సరోజినీ నరసింహస్వామి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రేపల్లె, సెప్టెంబరు 5 : స్థానిక రామకృష్ణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి హైస్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీలు.. అల్లాడుతున్న రైతులు

● స్వచ్ఛందంగా శుభ్రం చేసిన మూలపాలెం రైతులు

బాపట్ల, సెప్టెంబరు 5 : డ్రెయినేజి వ్యవస్థ సరిగ్గా లేక ముంపునకు గురైన పొలాలలోనీరు బయటకెళ్ళక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన డ్రైనేజీలలో నీటి ఉధృతి తగ్గినప్పటికి మైనర్ డ్రెయిన్‌ల నుంచి పొలాలలో నీరు వెళ్ళకపోవటం వల్ల ముంపునకు గురైన పొలాలలోని పైరు బయటపడలేదు. బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో ఆరు రోజులుగా వరిపైరు మొత్తం నీళ్ళలోనే ఉండిపోయింది. ఈ పొలాలలోని నీరు నల్లకాల్వల ద్వారా ఈస్ట్‌శ్యాంప్ నుంచి నల్లమడ డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే నల్లకాల్వలో తూటి, తుంగ, వ్యర్థాలు పెరిగిపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. అధికారులు తక్షణమే మరమ్మతులు చేయించి మురుగునీరు వెళ్ళే ఏర్పాటు చేస్తామని చెప్పి చేయలేదని ఆప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేది లేక స్వచ్ఛందంగా రైతులు చందాలు వేసుకొని కూలీల ద్వారా గుర్రపుడెక్క, జమ్ము తొలిగించి పొలాలలో నీరు పోయే విధంగా గురువారం చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉప్పాల శ్రీనివాసరావు, యేమినేని తిరుపతిరావు, ఈపూరి వెంకటరామయ్య, సూరగాని బుజ్జి, వల్లు శ్రీనుబాబు, దండుప్రోలు అక్కేశ్వరరావు, బొర్రా శివయ్య, మోర్ల నాగేశ్వరరావు, గవిని వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.


నల్లకాల్వలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్కను తొలిగిస్తున్న రైతులు

డ్వామా పీడీని సరెండర్ చేస్తూ ఉత్తర్వులు

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించి నందుకు డ్వామా పీడీ రాజేష్‌ను పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ వెంకటమురళి గురువారం ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వహించినందుకు నలుగురు అధికారులపై రెండు రోజుల క్రితం సస్పెన్షన్ వేటు వేయగా తాజాగా డ్వామా పీడీపై కూడా చర్యలు తీసుకున్నారు.

బాపట్ల ఆర్డీవో రవీందర్‌కు గుండెపోటు...

బాపట్ల ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న జి.రవీందర్ బుధవారం గుండెపోటుకు గురవడంతో ఆయనను గుంటూరులోని రమేష్ ఆసుపత్రికి తరలించారు. మైల్డ్ స్ట్రోకేనని డాక్టర్లు తేల్చడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. భట్టిప్రోలులో వరద సహాయక విధుల్లో ఉండగా ఆయన అస్వస్థతకు లోనయ్యారు. వరద ఉధృతిలో భాగంగా కరకట్టల భద్రత ప్రశ్నార్థకమైనప్పుడు పెదపులివర్రుతో పాటు రావి అనంతవరం కరకట్టల వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంలో ఆర్డీవో కీలకంగా వ్యవహరించారు.

కృష్ణానదికి తగ్గిన వరద

● కరకట్ట వెంట గ్రామాలకు విముక్తి
● గృహాల్లోకి చేరుకుంటున్న ప్రజలు


వరద తాకిడికి కోతకు గురైన ఓలేరు కరకట్ట నుంచి పెసర్లంక వెళ్ళే రహదారి

రేపల్లె, సెప్టెంబరు 5 : కృష్ణమ్మ కరుణించటంతో వరద తగ్గుముఖం పట్టింది. తీర ప్రాంత వాసులు కొంతమేర భయాన్ని వీడి ముప్పు నుంచి బయటపడ్డ గ్రామాల్లోకి పయనమవుతున్నారు. ఐదు రోజులపాటు కృష్ణమ్మ కన్నెర్ర చేయటంతో నీటిలో మునిగిపోయిన గృహాలను చూసుకునేందుకు గురువారం కుటుంబాలు తిరుగు పయాణమయ్యారు. రేపల్లె మండలం పెనుమూడి పల్లెపాలెం కృష్ణానదికి వరద కారణంగా సుమారు 150 గృహాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయారు. కరకట్ట వెంట ఉన్న పెనుమూడి, మైనేనివారిపాలెం, లంకేవానిదిబ్బ ఎస్‌టికాలనీలో పూర్తిగా గృహాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలంటూ ప్రజలు విన్నవించుకుంటున్నారు. మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయం వరద తాకిడికి ముందు భాగమంతా కొట్టుకుపోయింది. ముఖమండపం అంతా దెబ్బతింది. రెవెన్యూ అధికారులు పల్లెపాలెంలో విద్యుత్, పారిశుధ్యాన్ని మెరుగుపరిచే విధంగా అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించారు. శుక్రవారం నుంచి గృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహార జాబితాలను రూపొందిస్తామని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. గృహాలు కోల్పోయిన వారికి పెనుమూడిలోని పునరావాస కేంద్రంలో నుంచి ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గిపోయిందని, గత పరిస్థితికి చేరిందన్నారు. అంటువ్యాధులు విజృంభించకుండా చర్యలు చేపట్టామని స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

పంటంతా నీటిపాలు-కన్నీటిపర్యంతమవుతున్న రైతులు

కృష్ణానదికి వరద పోటెత్తటంతో ఆనుకుని ఉన్న రొయ్యల చెరువుల కట్టలు తెగి పంటంతా వరద పాలైందని వాణిజ్య పంటలు వేసిన రైతులు భోరున విలపిస్తున్నారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలోని కృష్ణ కరకట్ట వెంట ఉన్న రేపల్లె మండలంలోని పెనుమూడి, మైనేనివారిపాలెం, రావి అనంతవరం, భట్టిప్రోలు మండలం వెల్లటూరు, పెదపులివర్రు, పెసర్లంక, పెదలంక, కోళ్ళపాలెం, ఓలేరు గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాలకుపైగానే వాణిజ్యపంటలైన పసుపు, అరటి, కంద, బొప్పాయి, దొండ, బెండ, వంగ, పొట్ల, బొప్పాయి తోటలు వరద నీటిలో నాని కుళ్ళిపోయాయి. ఎకరాకు కౌలుకు రూ.60వేల వరకు భూ యజమానులకు చెల్లించామని, విత్తనాలు, ఎరువులకు, కూలీలకు రూ.లక్షరూపాయల వరకు పెట్టుబడి పెట్టామని వరద కారణంగా పంటంతా నీటిపాలైందంటూ భోరున విలపిస్తున్నారు. కృష్ణా కరకట్ట వెంట ఉన్న రొయ్యల చెరువులు సుమారు 50 వేలహెక్టార్‌లలో దెబ్బతిన్నాయని, వంద మంది రైతులకుపైగానే నష్టంవాటిల్లిందన్నారు. కోటిన్నర వరకు రొయ్యల పంట నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే ఎకరాకు కౌలుకుగాని, సాగుకుగాని కలిపి రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టామని, పెట్టిన పెట్టుబడంతా కృష్ణమ్మ వరద ఉధృతిలో కలిసిపోయిందన్నారు.ప్రభుత్వం దృష్టిసారించి ఆక్వా రైతులను ఆదుకోవాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.


పెనుమూడిలో బాధితులకు ఆహారాన్ని అందిస్తున్న తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, సిబ్బంది

వరదలకు లంక గ్రామాలు అతలాకుతలం

● అంచనాలకు అందని భారీ నష్టం
● కోలుకోలేని విధంగా నష్టపోయిన రైతాంగం


వరద ఉధృతికి నేలవాలిన కంద పైరు

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : కృష్ణమ్మ విలాయ తాండవానికి లంక గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఇప్పుడిప్పుడే వరద ముంపు నుంచి బయట పడుతున్న లంక గ్రామాలలో ఊహించని పరిస్థితులు ఎదురవుతున్నాయి. అంచనాలకు అందని విధంగా లంక గ్రామాలు భారీ నష్టాన్ని చవి చూశాయి. ప్రభుత్వ ఆస్తులతో పాటు ప్రజల ఆస్తులు భారీగా దెబ్బతిన్నాయి. లంక గ్రామాల్లో రహదారులు చాలా చోట్ల వరద ఉధృతికి కోతకు గురయ్యాయి. వరద ప్రవాహం వాణిజ్య పంటలతో పాటుగా గృహాల మీద నుంచి ప్రవహించడంతో కనివినీ ఎరుగని రీతిలో ప్రజలు నష్టపోయారు. ఇప్పటికీ కొన్ని లోతట్టు ప్రాంతాలు వరద ముంపులోనే ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని గృహవాసులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలన్నీ చెత్తా చెదారంతో నిండిపోయాయి. పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టినప్పటికీ అరకొర సిబ్బంది వల్ల పారిశుధ్య పనులు ముందుకు సాగడం లేదు. వరద వల్ల కొట్టుకువచ్చిన వ్యర్థాలన్నీ రోడ్లపైన దర్శనమిస్తున్నాయి. వీటన్నింటిని తొలగించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశుధ్య సిబ్బంది సరిపోవడం లేదు. మోటార్ సైకిల్‌పై లంక గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆ దృశ్యాలను వీక్షించి యంత్రాలను ఏర్పాటు చేసి లంక గ్రామాల్లో పరిస్థితులు వెంటనే చక్కదిద్దాలనే సంకల్పానికి వచ్చారు. ఈ మేరకు కలెక్టర్‌తో భేటి అయి చర్చిస్తామని అన్నారు.

వాణిజ్య పంటల్లో వరద నీరు...

వరద ముంపు గ్రామాల్లోని కొన్ని ప్రాంతాలను వీడినప్పటికీ వాణిజ్య పంటలను మాత్రం ఇంకా వీడలేదు. దీంతో వాణిజ్య పంటలు ఉరకెత్తిపోయి రూపురేఖలు కోల్పోతున్నాయి. బెండ, బీర, వంగ తదితర కూరగాయ పంటలు ఇప్పటికే వరద నీటిలో నాని కుళ్లిపోయి దర్శనమిస్తున్నాయి. అరటి తమలపాకు, బొప్పాయి, పసుపు, కంద పంటలలో వరద నీరు ఇంకా బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. పోతార్లంకకి చెందిన కొందరు రైతులు తమ పంటల్లోని నీటిని బయటకు పంపేందుకు కృష్ణనగర్ సమీపంలో రహదారికి గండికొట్టడంతో కృష్ణనగర్ వాసులు ఆ వరద నీరంతా తమ పొలాలు, ఇళ్లపైకి వచ్చి మళ్లీ ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ఆనందబాబు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పోతార్లంక గ్రామ రైతులతో మాట్లాడి వరద నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. లంక గ్రామాల్లో రైతులు చేపట్టిన కూరగాయ, వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోయి దెబ్బతినిపోతున్నాయి. శుక్రవారం నుంచి లంక గ్రామాల్లో దెబ్బతిన్న గృహాలతో పాటు వాణిజ్య పంటలు నష్టం అంచనా నమోదు చేయడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది.

● వేమూరు, సెప్టెంబరు 5 : మండల పరిధి గ్రామాల్లో ఐదు రోజుల నుంచి వర్షపు నీటిలో మునిగి ఉన్న వరి మొక్కలు పూర్తిగా కుళ్ళి దెబ్బతిన్నాయి. ప్రధానంగా జంపని, పెరవలి, పెరవలిపాలెం, చదలవాడ, వేమూరు పరిసర గ్రామాల పరిధిలోని పల్లపు భూముల్లో నీరు నిలవడంతో ఆయా భూముల్లో నాటిన నాట్లు నీటిలో కుళ్ళిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నీరు క్రమేపి తగ్గుతుండటం వల్ల వెదనాటు వేసిన మొక్కలు తేరుకుంటున్నాయి.

● చెరుకుపల్లి, సెప్టెంబరు 5 : మండలంలోని నడింపల్లి, కనగాల గ్రామాల్లోని భూములలో వర్షపునీరు ఇప్పటికి తగ్గలేదు. భూములు చెరువులను తలపిస్తున్నాయి. మురుగుకాల్వలు పారుదల కాకపోవటతో పైర్లు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. నడింపల్లిలోని నీటి మునిగిన పొలాలను గురువారం టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగినేని రామాంజనేయులు, కొడాలి రామమోహన్‌రావు, పులి రామకృష్ణ, గోగినేని వెంకట సుబ్బారావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


కుళ్లిపోయిన దొండ తోట


వరద ముంపు గృహం నుంచి సామగ్రిని తెచ్చుకుంటున్న మహిళలు

జగన్ విషప్రచారాలు ప్రజలు నమ్మరు : కొల్లా

బాపట్ల,సెప్టెంబరు 5 : వరద సహాయక చర్యలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై జగన్ విష ప్రచారాలు చేయటాన్ని ప్రజలు నమ్మరని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. చేతనైతే సాయం చేసి పాపాలు కడుక్కోవాలని జగన్‌కు హితవు పలికారు. ఈ విషయమై ఆయన గురువారం మాట్లాడుతూ చంద్రబాబుపై విద్వేషపూరితమైన ప్రచారాన్ని ఇకనైనా మానుకోవాలన్నారు.

పంట నష్టాల గణాంకాలను నమోదు చేయాలి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 5 : స్థానిక మండలప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం ఎంపీడీవో భవనం మారుతీ శేషమాంబ అధ్యక్షతన వ్యవసాయ, రెవెన్యూ శాఖలు, పంచాయతీరాజ్‌శాఖల అధికారులకు పంటనష్టంపై గణనకు సంబంధించిన విధివిధానాలను మండల వ్యవసాయ శాఖాధికారి సీహెచ్ సత్యానంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.పద్మజ, ఏఈవోలు ఎ.పావని, శేషుసుదర్శన్, గ్రామవ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 5 : మండలంలోని అల్లూరు గ్రామ పంచాయతీలోని నత్తలవారిపాలెం, అలకాపురం గ్రామపంచాయతీలోని మండేవారిపాలెం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు గురువారం సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శివజ్యోతి, నాయుడు చెంచురామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చవితి ఊరేగింపులకు అనుమతులు తప్పనిసరి

చెరుకుపల్లి, సెప్టెంబరు 5 : వినాయకచవితి విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ గురువారం చెప్పారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : కొల్లూరులోని తెనాలి ప్రధాన రహదారి పక్కన 55 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. వారిచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఏడుకొండలు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నీట మునిగిన పొలాలను సందర్శించిన ఏడీఏ

వేమూరు, సెప్టెంబరు 5 : అధిక వర్షాల వల్ల నీట మునిగిన వరి పొలాలను గురువారం బాపట్ల జిల్లా వనరుల కేంద్రం రైతు శిక్షణ, జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సయ్యద్ అక్బర్ హుస్సేన్ సందర్శించారు. చదలవాడ, కాకర్లమూడి గ్రామాలను ఆయన సందర్శించి నీట మునిగిన వరి మొక్కలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ తమకు తీవ్ర నష్టం జరిగిందని ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహకారంతో పాటు దెబ్బతిన్న పైరు స్థానంలో మరోమారు నాట్లు వేసుకునేందుకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చదలవాడ గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ వి.విజయ్‌కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పశుపోషకులకు దాణా పంపిణీ

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : పశు పోషకులకు పశు సంవర్థక శాఖ సరఫరా చేసిన దాణాను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. మండల పరిధిలోని సుగ్గునలంక, చింతల్లంక, పెదలంక గ్రామాలకు చెందిన పశు పోషకులకు గురువారం ఎమ్మెల్యే దాణా అందజేశారు. సుగ్గునలంకకు 275 బస్తాలు, చింతల్లంకకు 150 బస్తాలు, పెదలంకకు 100 బస్తాల పశుదాణాను అందించడం జరిగిందని పశు సంవర్ధక శాఖ డిఎహెచ్‌వో హనుమంతరావు అన్నారు. వైద్యాధికారి శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుంగభద్ర వంతెనపై వాహనాల రాకపోకలు నిషేధం

చుండూరు, సెప్టెంబరు 5 : చుండూరు-మున్నంగివారిపాలెంను కలుపుతూ తుంగభద్ర డ్రెయిన్‌పై భారీ వాహనాలు రాకపోకలు నిషేధించినట్లు తహసీల్దార్ దేవిశెట్టి మల్లికార్జునరావు గురువారం తెలిపారు. కొద్ది రోజులుగా డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో వంతెన మరింత బలహీన పడే అవకాశం ఉన్నందున దీనిపై వాహనాల రాకపోలను నిషేధిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ముంపు బాధితుల శిబిరం

చుండూరు, సెప్టెంబరు 5 : భారీ వర్షాలకు, తుంగభద్ర డ్రెయిన్ ఉధృతి ప్రవాహానికి మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్ల వెంట నివాసాలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలు నేలకొరిగాయి. యడ్లపల్లి జడ్‌పి పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి ఐదు రోజులుగా వీరికి అవసరమైన ఆహార, వైద్య సౌకర్యాలను అందిస్తున్నట్టు తహసీల్దార్ దేవిశెట్టి మల్లికార్జునరావు తెలిపారు.


తిప్పలకట్ట వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సర్వం కోల్పోయాం... మీరే ఆదుకోవాలి

● ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆనందబాబు భరోసా

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : అయ్యా.. సర్వం కోల్పోయాం మీరే ఆదుకోవాలంటూ లంక గ్రామాల్లో రైతులు, మహిళలు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు మొరపెట్టుకున్నారు. కొల్లూరు మండల పరిధిలోని కిష్కిందపాలెం, తిప్పలకట్ట, తడికలపూడి, జువ్వలపాలెం, పెసర్లంక, పెదలంక, ఈపూరులంక, సుగ్గునలంక తదితర గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లోని బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి పరామర్శించారు. ఇళ్లతో పాటు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలన్నీ కూడా వరద ఉధృతికి ఎందుకు పనికి రాకుండా పోయాయని మీరే మమ్మల్ని ఆదుకోవాలంటూ విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన వరద సమయంలో ఆహార, పానీయాలను పడవల ద్వారా గ్రామాలకు సరఫరా చేయడం, పారిశుధ్య పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరిగిందని చెప్పారు. విద్యుత్ సరఫరాను కూడా వెంటనే లంక గ్రామాలకు పునరుద్ధరణ చేయించామన్నారు. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. లంక గ్రామాల్లో ప్రజలందరికి నిత్యవసర వస్తువులతో పాటు రేషన్ అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, ప్రముఖ పారిశ్రామిక వేత్త వేములపల్లి రవికిరణ్, నర్రా మధు, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర శ్రీను, యార్లగడ్డ శ్రీనివాసరావు, కోగంటి శివవెంకటేశ్వరరావు, శిగిలిశెట్టి రాఘవరావు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులు ఎవరూ సర్వేలో నష్టపోకూడదు : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : కృష్ణానది వరద విపత్తు వల్ల దెబ్బతిన్న గృహాల సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కొల్లూరులోని శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన గృహాల సర్వే బృందాలకు సర్వే చేసే విధానంపై అవగాహన కల్పించారు. వరద ధాటికి లంక గ్రామాల్లో 24 ఆవాస ప్రాంతాలు దెబ్బతిన్నాయని, పూర్తిగా దెబ్బతిన్న గృహాలు, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలు, కచ్చా గృహాలపై నష్టాల వివరాలు సేకరించాలన్నారు. జలదిగ్బంధంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సర్వే నిర్వహించాలని బృందాలను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ సర్వేలో నష్టపోకూడదని 15 శాతం దెబ్బతిన్న గృహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈనెల 9వ తేదీ లోపు సర్వే ముగించాలని ఆదేశించారు. అనర్హులను నష్టపోయిన జాబితాలో చేరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, ఆర్డీవో హేలాషారోన్, మండల ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పర్యటన

లంక గ్రామాల్లో కలెక్టర్ జె.వెంకటమురళి గురువారం పర్యటించారు. తొలుత మండల పరిధిలోని ఆవులవారిపాలెంలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని సూచించారు. పెదలంకలో వరదల వల్ల నష్టపోయిన పంటలను, పెసర్లంకలో వరద తాకిడికి దెబ్బతిన్న గృహాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం వరద విపత్తు వల్ల నష్టపోయిన కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : వరదల వల్ల లంక గ్రామాల్లో సర్వం కోల్పోవడంతో పాటు విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు సైతం తడిసిపోవడంతో గురువారం రాష్ట్ర సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం సభ్యులు కిష్కిందపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం, పెదపాలెం గ్రామాల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, బ్యాగులు పెన్సిల్, జామెంట్రీలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులందరూ సహాయ సహకారాలు అందించినట్లు రాష్ట్ర సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, హరిప్రసాద్, సుభాని, ఎస్టేట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ వరద బాధితులకు ఆహారం పంపిణీ చేసింది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లోని నిర్వాసితులు భట్టిప్రోలు విశ్వశాంతి స్కూల్‌లో తలదాచుకున్నారు. వారికి గురువారం ఆహారం, మంచినీరు, దుప్పట్లు అందించారు. గాజుల్లంక గ్రామంలోని బాధితులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ప్రియస్వప్న, రత్నరాజు, సాల్మన్‌రాజు, జోబ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

● వరద బాధితులకు ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ తమవంతు సాయం అందజేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని జువ్వలపాలెం, కొత్తగూడెం, పెసర్లంక గ్రామాల్లో గురువారం ఆహారం, మంచినీరు బాధితులకు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాల ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జ్యోతిబసు, కళ్యాణ చక్రవర్తి, ఐపీఎస్ఎఫ్ మెంటర్స్ నందగోపాలకృష్ణ, భార్గవి, రెడ్‌క్రాస్ మెంబర్ లక్ష్మీదుర్గ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

● విజన్ ఆఫ్ హోప్ మిషన్ సంస్థ డైరెక్టర్ అమృతలూరి రవీంద్ర, జ్యోతి కిచెన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని తోకలవానిపాలెం, తురకపాలెం, కిష్కిందపాలెం గ్రామాల్లో వెయ్యి మంది బాధితులకు ఆహారం అందజేశారు. అమృతలూరు గ్రామానికి చెందిన జి.వాసంతి, జి.రాజేశ్వరి, జి.సునీత, డి.రాధ, కె.విజయ, కె.చిన్న, జి.సన్నిబాబు, కె.భాస్కర్, అమృతలూరు అంబేద్కర్ యూత్ సభ్యులు భోజనం తయారీలో పాలు పంచుకున్నారు. వారందరికి సర్పంచ్ టి.కృష్ణమోహన్, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

● రేపల్లె, సెప్టెంబరు 5 : మండలంలోని బేతపూడి కాల్వకట్టపై జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు తెనాలికి చెందిన ట్రైబుల్స్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు అంజలి రావూరి బియ్యం, వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి పక్కా గృహాలు అందించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విజ్ఞప్తి చేస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో పాస్టర్ యాకోబ్, రావూరి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని పెనుమూడి పల్లెపాలెం వరద బాధితులకు గీతబంధు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల ప్యాకెట్లు, మంచినీటి బాటిల్స్‌ను గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు పంపిణీ చేశారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తుళ్ళూరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కె.ధనుంజయరావు, ఉప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● చుండూరు, సెప్టెంబరు 5 : యడ్లపల్లి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇదే పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉంటున్న 300 మందికిపైగా బాధితులకు చేయూతనందించారు. ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతరులు సంయుక్తంగా పునరావాస కేంద్రంలో ఉంటున్న బాధితులకు చీరలు, దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేణు, వసంతరావు, రెవెన్యూ, పారా మెడికల్ సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, సెప్టెంబరు 5 : భట్టిప్రోలు మండలం పెసర్లంక పంచాయతీలోని గ్రామాలలో వరదబాధితులకు రాష్ట్రాధ్యక్షులు కేశన శంకరరావు పిలుపుమేరకు ఆహారపొట్లాలు, మినరల్ వాటర్ బాటిళ్ళను బీసీ సంక్షేమసంఘం యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, బాపట్ల పట్టణ యువజన అధ్యక్షులు గోపినాధ్‌లు అందజేశారు. గుంటూరుజిల్లా అధ్యక్షులు మహేష్, బాపట్లజిల్లా ఉపాధ్యక్షులు జొన్నదల వెంకటేశ్వర్లు, నియోజకవర్గం అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

● కర్లపాలెం, సెప్టెంబరు 5 : కర్లపాలెం మండలంలోని రెడ్డి సేవామిత్ర ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాలైన పెసర్లంక, పెద్దలంక గ్రామాలలో గురువారం ఆహారం, వాటర్ బాటిళ్ళను ఆటోలలో తరలించి బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంగు గోవర్ధనరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, పిట్ల శ్రీనివాసరెడ్డి, పైనం శ్రీనివాసరెడ్డి, ఏత్ర వెంకటేశ్వరరెడ్డి, ఆట్ల బాలశంకరరెడ్డి, శీలం పోలిరెడ్డి, ఏత్ర ప్రసాదరెడ్డి, శ్యామ్, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితుల కోసం ఎమ్మెల్యే ఏలూరికి విరాళాలు అందజేసిన యద్దనపూడి మండల నేతలు

వరద బాధితులకు విరాళాలు

- ఏలూరి పిలుపుతో ముందుకొస్తున్న దాతలు

పర్చూరు, సెప్టెంబరు 5 :విజయవాడలో వరద సహాయక చర్యలు శరవేగంగా చేపడుతున్నామని, బాధితులకు అక్కడ ఎలాంటి కష్టం రాకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం విజయవాడలో ఏలూరిని కలసిన స్థానిక నేతలతో ఆయన మాట్లాడారు. వదర బాధితుల సహాయార్థం దాతలు స్పందిస్తున్న తీరు మరువలేనిదన్నారు. బాధితులను ఆదుకునేందుకు పెద్ద ఎత్తున దాతలు ముందుకు రావాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. ప్రజలను కష్టం నుంచి గట్టెక్కించేందుకు చంద్రబాబు సారథ్యంలో అందరూ రేయింబవళ్లు పనిచేస్తున్నామన్నారు. ఎవరై అధైర్యపడవద్దని, ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఏలూరి బాధితులకు చెప్తున్నారు.

విరాళాలు ఇలా

విజయవాడ వరద బాధితుల సహాయార్థం పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఆయా గ్రామాల నేతలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు విరాళాలను అందజేశారు. యద్దనపూడి మండలానికి చెందిన నాయకులు రూ.2,05,000లక్షలు ఏలూరికి అందజేసి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ఉన్నారు.

సింథైట్ రూ.10లక్షల సాయం

మేదరమెట్ల, సెప్టెంబరు 5 : ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం మేదరమెట్లకు చెందిన సింథైట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.10లక్షల చెక్కును కలెక్టర్ వెంకటమురళికి అందజేశారు. గురువారం సింథైట్ ఫ్యాక్టరీ హెచ్ ఆర్ జనరల్ మేనేజర్ సలామ్ చెక్కును అందజేశారు.



కలెక్టర్ వెంకటమురళికి రూ.10లక్షల చెక్కును అందజేస్తున్న హెచ్‌ఆర్ మేనేజర్ సలామ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి
- మానవతాదృక్పథంతో అవయవాలు ప్రభుత్వానికి అందజేత
- కొమ్మినేనివారిపాలెంలో అలుముకొన్న విషాదఛాయలు

బల్లికురవ, సెప్టెంబరు 5 : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ యువ ఉద్యోగి వెల్లలచెరువు చంద్రశేఖర్ (36) తమిళనాడులో రోడ్డు ప్రమాదానికి గురై వారం రోజులుగా మృత్యువుతో పోరాడి బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. గత నెల 28వ తేదీన తన ఇంటి నుంచి దేవాలయానికి బైకుపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న బైకు ఢీకొని చంద్రశేఖర్ తలకు బలమైన గాయం అయింది. వెంటనే వారి బంధువులు తమిళనాడులోని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తరలించి చికిత్సను అందించారు. తలకు సర్జరీ చేసినప్పటికీ అతడు కోమాలోకి వెళ్లారు. దీంతో ఉద్యోగి కుటుంబ సభ్యులు మానవతాదృక్పథంతో చంద్రశేఖర్ శరీర అవయవాలను తమిళనాడు ప్రభుత్వానికి డొనేట్ చేశారు. గుండె, కళ్లు, కిడ్నీ ఇతర అవయవాలను అందజేశారు. మృతదేహాన్ని స్వగ్రామం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి గురువారం తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రశేఖర్ ఆరేళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.చంద్రశేఖర్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.



చంద్రశేఖర్ (ఫైల్)



విక్రయ కేంద్రాలలో సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



వినాయక చవితికి వాన భయం

- అమ్మకందారుల గుండెల్లో గుబులు
- పెరిగిన ధరలు
- 30 శాతం ఇంకా వెళ్లని విగ్రహాలు
- వరద బాధితులకు సాయం చేద్దామని కొందరు పండుగకు దూరం

అద్దంకి, సెప్టెంబరు 5 : వినాయక చవితి రానేవచ్చింది. శనివారం నిర్వహించే పండుగకు విగ్రహాల అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయి. 30 శాతం కూడా బుకింగ్ కాలేదు. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్, రాజీవ్‌కాలనీ సమీపాలలో నామ్ రోడ్డు వెంబడి మూడు చోట్ల సుమారు 400 విగ్రహాల వరకు తయారు చేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. వీటిలో గురువారం రాత్రి వరకు సుమారు 100 విగ్రహాలకు పైగానే మిగిలి ఉన్నాయి. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని, మూడు రోజుల ముందుగానే అన్ని విగ్రహాలకు బుకింగ్ పూర్తయి, అడ్వాన్స్‌లు కూడా ఇచ్చే వారని అమ్మకం దారులు అంటున్నారు. ఇటీవల వరకు భారీ వర్షాలు కురవడంతో పాటు గురువారం నుంచి మరలా తుపాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికతో విగ్రహాల కొనుగోలుకు నిర్వాహకులు వెనుకడుగు వేస్తున్నారు. ఒక వేళ వర్షాలు తేకపోతే అప్పటికప్పుడు కొనుగోలు చేసుకోవచ్చనే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం. దీంతో అమ్మకందారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వరదలు విజయవాడతో పాటు బాపట్ల, గుంటూరు జిల్లాలలోని పలు ప్రాంతాలు బాగా దెబ్బ తినటంతో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఖర్చును వరద ప్రాంత ప్రజల సహాయం అందించవచ్చనే అభిప్రాయం తో మరికొందరు చవితి పండుగను విమరించుకుంటున్నట్లు తెలిసింది. వినాయక విగ్రహాల ధరలు విషయానికి వస్తే గత ఏడాది కంటే 10శాతం మేర పెరిగాయి. విగ్రహాలు అమ్మకాలు జరగకుండా మిగిలి పోవడంతో ధరలు మరింత తగ్గించి అమ్మకాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేసే పందిళ్ల వద్ద టెంట్‌లకు ఎక్కువ డిమాండ్ వచ్చింది. వర్షాల నేపథ్యంలో అత్యధిక శాతం నిర్వాహకులు వాటర్ ప్రూఫ్ టెంట్‌లు వేసేందుకు సిద్ధంఅవుతుండడంతో కొరత ఏర్పడింది.

తాటాకు పందిళ్లు సిద్ధం

మార్టూరు : వినాయకచవితి పండుగకు తాటాకు పందిళ్లను భక్తులు సిద్ధం చేస్తున్నారు. యువకులు చందాలను వసూలు చేసి, ఉత్సాహంగా వినాయకచవితి పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు మార్టూరు సెంటర్లో ఏటా రాజస్థాన్‌కు చెందిన కార్మికులు వినాయకుని బొమ్మలను తయారు చేస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా సుమారు 80 బొమ్మలను తయారు చేశారు. బొమ్మలకు డిమాండ్ రాగా, కొందరు గుంటూరు నుంచి బొమ్మలను కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఒక్కో బొమ్మ రూ.65వేల వరకూ ఉన్నట్లు చెప్తున్నారు.

ఊరట

ఇళ్ల పెండింగ్ బిల్లులకు మోక్షం

రూ.50కోట్లు విడుదల చేయనున్న ప్రభుత్వం

2016 నుంచి పక్కాగృహాల బిల్లులను పెండింగ్‌లో పెట్టిన గత ప్రభుత్వం

అర్థంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలు

కొందరు అప్పులు చేసి పూర్తిచేశారు

పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపట్టిన కూటమి ప్రభుత్వం

ఇళ్ల లబ్ధిదారులకు ఊరటనిచ్చే విషయం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బిల్లులు అందక నిలిచిపోయిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఆర్థిక సహాయం అందించే దిశగా చర్యలు చేపట్టింది. అప్పట్లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించనుంది. అందుకోసం అవసరమైన చర్యలను ఇప్పటికే చేపట్టింది. ఇందుక సంబంధించి గృహనిర్మాణశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు ఇళ్ల లెక్క కడుతున్నారు. వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. నిర్మాణం ఏ స్థాయిలో ఉందో నమోదు చేయడంతో పాటు లబ్ధిదారుని తాజా వివరాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో లబ్ధిదారులలో ఆశలు చిగురించాయి.

ఒంగోలు నగరం, సెప్టెంబరు 5: ఇళ్ల లబ్ధిదారులకు కూటమి సర్కారు తీపికబురు అందించింది. ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత పెండింగ్ బిల్లులు రాబోతున్నాయి. సొంత గూడు కట్టుకోవాలనుకున్న పేదలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి ప్రదర్శించింది. పక్కాగృహాలు మంజూరై నిర్మాణాలను ప్రారంభించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా కక్షపూరితంగా వ్యవహరించింది. దీంతో చేసేది లేక లబ్ధిదారులు నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. కొంతమంది ఇక ప్రభుత్వంపై నమ్మకం లేక వడ్డీలకు డబ్బులు తెచ్చి ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆ తర్వాత ఇంటి నిర్మాణాలకు బిల్లులు చెల్లించండి మహాప్రభో అంటూ గత ఐదేళ్లుగా వేడుకున్నా వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు. ఏళ్లు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవటంతో జిల్లాలో వేలాది మంది చిక్కుల్లో పడిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పక్కా గృహాల నిర్మాణాలను పూర్తిచేయలేని లబ్ధిదారుల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవటంతో నిలిచిపోయిన ఇంటి నిర్మాణాల లెక్కలను తేల్చుతోంది.

టీడీపీ హయాంలో భారీగా మంజూరు

2016వ సంవత్సరం నుంచి పక్కాగృహాల నిర్మాణాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి దశల వారీగా బిల్లులు ఇచ్చింది. అయితే చాలా నిర్మాణాలు సగంలో ఉండగానే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వస్తూనే 2014 నుంచి 2020 సంవత్సరం వరకు పక్కాగృహాల నిర్మాణం చేపట్టిన వారికి పూర్తిగా బిల్లుల చెల్లింపులను నిలిపివేసింది. దాదాపు 25వేల మంది లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వీరిలో కొంతమంది మాత్రమే అప్పులు చేసి నిర్మాణాలను పూర్తిచేసుకున్నారు. మిగిలిన వేలాది మంది పేదలు తమ నిర్మాణాలను మధ్యలోనే ఆపేసి అద్దె ఇళ్లలో, పరజా పట్టల కింద, పాకలలో నివాసం ఉంటున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం వారి బిల్లులను చెల్లించే దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టింది.

వివరాల సేకరణలో హౌసింగ్ అధికారులు

బిల్లులు అందక నిర్మాణాలును నిలిపివేసిన లబ్ధిదారుల వివరాలను గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ అధికారులతో సేకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను తయారుచేసింది. ఈ యాప్ ద్వారా బిల్లులు అందని లబ్ధిదారుల వివరాలను సేకరించి అప్‌లోడ్ చేస్తున్నారు. లబ్ధిదారు, వారు చేపట్టిన పక్కాగృహం ఏ స్థాయిలో ఉంది. వారి బ్యాంకు ఖాతా వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా ప్రస్తుతం అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వివరాలను పూర్తిస్థాయిలో ఈనెల 12వతేదీలోగా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. వివరాలను సేకరించిన తర్వాత బిల్లులు చెల్లించేందుకు రూ.50కోట్లకుపైనే అవసరం అవుతుందనేది గృహ నిర్మాణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బిల్లులు అందక నిర్మాణాలు నిలిచిపోయినవి 25వేలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

నిర్మాణాల వేగవంతానికి చర్యలు

పక్కా గృహాలకు అదనంగా రూ.35వేలు

జిల్లాలో పక్కాగృహాల నిర్మాణాల వేగాన్ని పెంచేందుకు గృహ నిర్మాణశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పక్కాగృహాలు మంజూరై నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా మరో రూ.35వేలు అందజేయనుంది. లబ్ధిదారులకు ప్రభుత్వం యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అందజేస్తుంది. లబ్ధిదారులు పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉంటే వారికి బ్యాంకుల నుంచి గృహాల నిర్మాణాలకు అదనంగా రూ.35వేలు గతంలోనే ఇప్పించారు. గత ప్రభుత్వంలోనే ఇది జరిగింది. ప్రభుత్వం ఇచ్చే యూనిట్ విలువ నామమాత్రంగా ఉండటంతో జిల్లాలో పక్కా గృహాల నిర్మాణాలు అనుకున్నంత వేగంగా జరగలేదు. ఇది గమనించిన ప్రస్తుత ప్రభుత్వం గతంలో పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారికి రూ.35వేలు ఆదనంగా రుణం ఇప్పించగా, ఇప్పుడు వారికే అదనంగా మరో రూ.35వేలు రుణం అందించనున్నారు. దీంతో యూనిట్ విలువ రూ.2.50 లక్షలకు చేరనుంది. ఇలా యూనిట్ విలువ పెరగటంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తిచేసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలో గత ప్రభుత్వం మంజూరుచేసిన పక్కాగృహాల్లో 25 వేలమంది లబ్ధిదారులు ఇంతవరకు నిర్మాణాలను ప్రారంభించనేలేదు. వీరికి మంజూరు చేసి మూడేళ్లు దాటిపోతోంది. ఇక వీరు నిర్మాణాలను చేపట్టే అవకాశం లేదని అధికారులు భావిస్తున్నారు. 21,403 మంది లబ్ధిదారులు తమ నిర్మాణాలను పూర్తిచేసుకోగా 16,066 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీరికి ఇప్పుడు అదనంగా బ్యాంకుల నుంచి గాని, వెలుగులో అమలు జరుగుతున్న వివిధ పథకాల ద్వారా గానీ అదనంగా మరో రూ.35వేలు రుణంగా అందజేయనున్నారు.



మద్దిపాడులో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా గృహనిర్మాణశాఖాధికారిగా శ్రీనివాస ప్రసాద్



జిల్లా గృహ నిర్మాణశాఖాధికారిగా పెరుగు శ్రీనివాసప్రసాదు గురువారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆ పోస్టులో పనిచేసిన పేరయ్య కొద్దిరోజుల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆ శాఖలోనే ఒంగోలు ఈఈగా పనిచేస్తున్న పెరుగు శ్రీనివాస ప్రసాద్‌కు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన గురువారం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

ఆపన్నహస్తం

భారీగా సాయం అందిస్తున్న విభిన్న వర్గాలు

సీఎంను కలిసి రూ1.50 కోట్లు ఇచ్చిన మాగుంట కుటుంబం

జిల్లా నుంచి మరో లక్ష ఫుడ్ పార్శిళ్లు, వాటర్ బాటిళ్లు, ఇతర సామగ్రి

విరాళాలు, ఆహారం అందజేతకు ముందుకొస్తున్న జనం

సహాయక చర్యల పర్యవేక్షణలో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరదలతో సర్వం కోల్పోయిన విజయవాడ బాధితులకు ఆపన్నహస్తం అందించడం కోసం జిల్లాలోని విభిన్న వర్గాల వారు ముందుకొస్తున్నారు. వరుసగా నాల్గవరోజైన గురువారం కూడా వివిధ ప్రాంతాల నుంచి భారీగా ఆహారం, మంచినీరు, ఇతర సామగ్రి విజయవాడకు పంపించారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేకించి కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవ చూపుతున్నారు. క్షేత్రస్థాయి అధికారులు, వివిధ శాఖలను కదిలించడంతో వారంతా తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఎవరికి వారుగా వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, పారిశ్రామిక వర్గాల వారు కూడా అలాగే స్పందిస్తున్నారు.

బాధితులకు అండగా నిలిచారు

ఈక్రమంలో జిల్లా నుంచి గురువారం లక్షకు పైగా ఆహార పొట్లాలు, మరో లక్ష వరకు మంచినీళ్ల బాటిళ్లు, సుమారు పది వేల దుప్పట్లు ఇతరత్రా సామగ్రి విజయవాడకు తరలించారు. ఉద్యాన శాఖకు చెందిన అధికారులు చొరవ చూపి ఐదు వేల పులిహోర ప్యాకెట్లు పంపగా ఒంగోలు నగరంలోని 42 మసీదులకు చెందిన ముస్లింలు మూడు బస్సుల్లో దాదాపు 10 వేల ఆహార పొట్లాలు తీసుకెళ్లి బాధితులకు అందజేశారు. ఒంగోలులోని వివిధ బ్యాంకుల సిబ్బంది 9 వేల ఆహార ప్యాకెట్లు, పది వేల వాటర్ బాటిళ్లను పంపారు. గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పది వేల వాటర్ బాటిళ్లను పంపారు. అలాగే వివిధ ప్రాంతాల వారు స్పందించి తగురీతిలో సహాయపడుతున్నారు. ఇక విరాళాలు కూడా అందజేస్తున్నారు.

మాగుంట కుటుంబం భారీ సాయం

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబం తరఫున ఏకంగా రూ.1.50 కోట్ల భారీ సాయాన్ని వరద బాధితులకు ఇచ్చారు. ఎంపీ మాగుంటతోపాటు ఆ కుటుంబ సభ్యుడైన దివంగత మాజీ ఎంపీ సుబ్బరామిరెడ్డి అల్లుడు ఆనం శివకుమార్‌రెడ్డి గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. అంతకు ముందు కలెక్టర్ అన్సారియా విజ్ఞప్తి మేరకు బుధవారం రూ.10లక్షలు ఇక్కడ అందించారు. బీపేటకు చెందిన దివ్యాంగులు రూ.19వేలను కలెక్టర్‌కు అందజేశారు. మార్కాపురంలోని సాయిబాలాజీ స్కూలు విద్యార్థులు రూ.22,500ను అక్కడి సబ్ కలెక్టర్‌కు అందజేయగా మరికొంతమంది నేరుగా సీఎం సహాయనిధికి పంపుతున్నారు. కొన్ని ప్రాంతాలలో విద్యార్థులు, ప్రజాసంఘాల వారు విరాళాలు సేకరించి పంపుతున్నారు. కొండపి మండలం వెన్నూరులో ఇద్దరు విద్యార్థులు తాము దాచుకున్న రూ.6440ను గ్రామ సర్పంచ్ గొర్రెపాటి సంధ్యారాణికి అందజేశారు. విజయవాడలో వరద బాధితుల సహాయక కార్యక్రమాలలో గురువారం కూడా జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి పాల్గొన్నారు. ఆయనకు ప్రభుత్వం తరఫున కేటాయించిన జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి బాధిత ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు అధికార యంత్రాంగం ద్వారా సహాయ కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారు. గురువారం 60మంది పారిశుధ్య కార్మికులు విజయవాడలో సహాయ చర్యల్లో పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎంపీ మాగుంట

నిండాముునిగిన వేరుశనగ రైతు

- వర్షాలకు తడిసి పోయిన పంట
- కోతకు ముందే మొలకలు వచ్చిన కాయలు
- తడిసి రంగు మారిన దిగుబడి
- కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు

కొత్తపట్నం(ఒంగోలునగరం) సెప్టెంబరు 5: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని వేరుశనగ రైతులు లబోదిబోమంటున్నారు. తీరప్రాంతంలోని ఇసుక నేలల్లో సాగు చేసిన వేరుశనగ పైరు వర్షాలకు బాగా దెబ్బ తిని పోయింది.ఈ ఏడాదిజూన్, జూలై మాసాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను ఇప్పుడు రైతులు తీస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వానలకు కోత కోసేందుకు పీకి పొలంలో ఉన్న వేరుశనగ వానకు పూర్తిగా తడిసి పోయింది. గత వారంరోజులుగా ముసురు కమ్ముకోవటంతో పొలాల్లో ఉన్న వేరుశన పంట పూర్తిగా వానలకు తడిసి పోయింది. కొంత మంది రైతులు కాయలు కోత కోసంపొలంలోనే ఆ ర బెట్టుకున్నారు. ఇవి కూడాతడిసి పోయాయి. తడిసిపోయిన కాయలు నల్లగా రంగు మారి పోయాయి. కోత కోసిఉంచిన కాయలు వానలకు రాసిలోనే మొలకలు వేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వానకు తడిసి కాయలను ఆ ర బోసుకునేందుకు తగిన సౌకర్యాలు లేకపోవటంతో రైతులు పీకిన పంటను, కోసిన వేరుశనగ కాయలను పొలంలోనే ఉంచారు. మొత్తం పంట అంతా వర్షార్పణం అ య్యింది. కొత్తపట్నం మండలంలోని తీరంలో ఉన్న ఇసుక నేలల్లో రైతులు వేల ఎ క రాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. సాగుకు స్ప్రింకర్లు అందుబాటులోకి రావటంతో ఇసుక నేలల్లో వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కొత్తపట్నం, ఈతముక్కల, మడనూరు,రాజుపాలెం, గమళ్లపాలెం, పాదర్తి, మోటుమాలు, పిన్నివారిపాలెం, గుండమా గ్రామాల్లోని రైతులు వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగ కోత దశకు చేరుకోవటంతో గత పదిరోజులుగా రైతులు వేరుశనగ పైరును పీకుతున్నారు. పీకిన పైరు కోత కోసేందుకు పొలంలోనే ఉంచారు. కొంత మంది రైతులు కాయలు కోసి పొలంలోనే రాసులుగా పోశారు. ఈ దశలో వర్షం కురవటంతో పొలంలోనే కాయలు తడిసి రైతులు నష్టాల బారిన పడ్డారు. రైతులు ఎ కరాకు రూ. 50 వేలకు పైగా ఖర్చు చేసి సాగు చేశారు. పంట దిగుబడి బాగుండి ఈ ఏడాది లాభాలు వస్తాయనుకుంటున్న సమయంలో వాన రైతులను నిలువునా ముంచేసింది. రైతులు బుధ,గురువారాల్లో పొలాల్లోనే ఉండి పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కోత కోసిన వేరుశనగ కాయలకు పట్టలు కప్పుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కోత కోయని పంటను వాన నుంచి కాపాడుకునేందుకు ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు చేర్చుకుంటున్నారు.

మండలంలోని ఇసుక నేలల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ వర్షానికి తడిసి పోయి రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని స్థితిలో పడ్డారు. వానకు తడిసి రంగు మారిన కాయలను వ్యాపారులు అసలు కొనుగోలు చేయరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానకు తడిసి కాయలోని పప్పు కుళ్ళిపోతుందని దీంతో ఆయిల్ తీసేందుకు కూడా పనికి రాకుండా పోతుందని రైతులు అంటున్నారు. వర్షంతో కోలుకోలేదని విధంగా దెబ్బతిని పోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.





కొత్తపట్నం ప్రాంతంలో పీకిన వేరుశనగ పైరు (ఇన్‌సెట్లో) విత్తనాల నుంచి వచ్చిన మొలకలు

వరద బాధితుల కోసం ఏపీయూడబ్ల్యూజే రూ.50వేల విరాళం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 5: ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(ఏపీయూడబ్ల్యూజే) తరుపున రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు నేతృత్వంలో గురువారం సాయంత్రం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి ఈమేరకు చెక్కును అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ వరద ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని సీఎంను కోరారు.

సమాచారశాఖ ద్వారా ప్రత్యేకంగా బాధిత జర్నలిస్టు కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని చేసిన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్దన్, ఉపాధ్యక్షుడు జయరాజ్, ఏచూరి శివ, చావా రవి, నాగరాజు, మల్లి, రాజేంద్ర పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్వగ్రామానికి మత్స్యకారులు

చినగంజాం, సెప్టెంబరు 5 : పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు ఎట్టకేలకు గురువారం స్వగ్రామానికి చేరారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో క్షేమంగా మత్స్యకారులు తమ ఇళ్లకు చేరుకున్నారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురం గ్రామానికి చెందిన బసంగారి జయరామ్, కొండూరి రాముడు కాకినాడ నుండి గురువారం స్వగ్రామానికి వచ్చారు. గత నెల 23వ తేదీన చెన్నై నుంచి చేపల వేట చేసుకుంటూ విశాఖపట్నం సముద్రతీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో ఐరన్‌బోటు ఇంజన్ దెబ్బతినడంతో వారు సముద్రంలో చిక్కుకున్నారు. బోటు ఇంజన్ మరమ్మత్తులు చేసుకొని కాకినాడ తీరానికి చేరుకోవడానికి రెండు రోజుల సమయం పట్టిందని జయరామ్ తెలిపారు. రుద్రమాంబపురానికి నేను, రాముడు మాత్రమే వచ్చామని, మాతో పాటు ఉన్న కాటంగారి బాబూరావు, ఆవల మునియ్య చెన్నై వెళ్లినట్లు తెలిపారు. వీరిద్దరితో పాటు ఉన్న మరో ఆరుగురు మత్స్యకారులు కలిసి బోటుని యాజమానికి అప్పగించేందుకు వెళ్లారని చెప్పారు. సముద్రంలో చిక్కుకున్న మమ్ములను క్షేమంగా తీరానికి చేర్చేందుకు చర్యలు చేపట్టిన హోం, రెవెన్యూ మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అధికారులకు మత్స్యకారులు జయరామ్, రాముడులు కృతజ్ఞతలు తెలిపారు.



గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

టీచర్ల చేతుల్లోనే సమాజ భవిత

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 5: ఉపాధ్యాయుల చేతుల్లోనే సమాజ భవితవ్యం ఆధారపడి ఉందని, గురువే ప్రత్యక్ష దైవమని, వారి సేవలను గుర్తించి సన్మానించడం అందరి బాధ్యత అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గురువారం జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకాయమ్మ మాట్లాడుతూ గురువులందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో గురువు పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని కూడా అలవర్చి రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను, ఇబ్బందులను అధిగమించి నైపుణ్యాలను పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62మంది హెచ్‌ఎంలు, టీచర్లను సన్మానించారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డీఈవో సుభద్ర, ఉపవిద్యాధికారి సుబ్బారావు, పాల్గొన్నారు.

రూపు మారిన మార్టూరు వాగు

» ఇసుక మాయం కావడంతో పెరిగిన గడ్డి, నాచు
» నీటి ప్రవాహానికి అడ్డంకి
» మరమ్మతులు చేయాలని రైతుల విజ్ఞప్తి

మార్టూరు, సెప్టెంబరు 5 : మార్టూరు వాగు రూపం మారిపోయింది. వాగులో నీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదు. గడ్డితో, విపరీతంగా పెరిగిన నాచుతో, చిల్లచెట్లతో నిండిపోయింది. మరోపక్క వాగు కట్టపై తుమ్మ చెట్లు పెరిగిపోయాయి. దాంతో వాగులో వచ్చే నీటి ప్రవాహానికి గడ్డి, నాచు అడ్డుగా మారాయి. ఈ క్రమంలో వాగులో ఉన్న ఇసుకను మాయం చేశారు.

2014 నుంచి 2019 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రెండేళ్లకు ఒకసారైనా వాగులోని చిల్లచెట్లను తొలగించి, పూడిక తీసేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వాగును పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో వాగులో చిల్లచెట్లు పెరిగిపోయాయి. మార్టూరు నుంచి గన్నవరం వెళ్లే రోడ్డులో మార్టూరు వాగుపై చంద్రబాబు పాలనలో బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి ముఖ్యంగా దక్షిణంవైపు వాగులో పూర్తిగా నీటి ప్రవాహానికి ఆటంకిగా మారాయి. ఈ బ్రిడ్జికి ఉత్తరం వైపు రెండు చెక్ డ్యాంలతో పాటు, ఈ వాగులోని నీరు డేగరమూడి వాగులోకి కలుస్తుంది. బ్రిడ్జికి దక్షిణంవైపు నీటి ప్రవాహానికి అవరోధం ఏర్పడడంతో దిగువకు నీరు సక్రమంగా పారడంలేదు. అంతేకాకుండా బ్రిడ్జికి ఇరువైపులా వాగుకు కట్టలు కూడా సక్రమంగా లేకపోవడంతో వాటి సమీపంలోని రైతులు వాగు స్థలాన్ని తమ


మార్టూరు వాగులో దట్టంగా పెరిగిన గడ్డి

పొలాల్లో కలిపేసుకున్నారు. వాగులోని నీరు ముందుకు వెళ్లే సమయంలో ఈ నీరు పక్కనే ఉన్న పొలాల్లోకి చేరిపోతున్నది. ఈ నీటి కారణంగా పొలాల్లోని పంట నష్టపోతున్నది. ఒక మోస్తరు వర్షం కురిసినపుడు భారీగా వాగు నుంచి నీటి ప్రవాహం ఉండదుగాని, భారీగా వర్షం, వరదలు వచ్చినపుడు మాత్రం వాగు నుంచి నీరు సక్రమంగా ప్రవహించక, పక్కనే ఉన్న పొలాలకు నీరు చేరిపోతున్నది. అందువలన వాగులో ఉన్న చిల్లచెట్లను, గడ్డి, నాచును తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాగుకు ఇరువైపులా కట్టను ఏర్పాటు, పూడిక తీయాలని రైతులు కోరుతున్నారు. దాంతో ఇసుక వచ్చి చేరుతుంది. గతంలో ఈ వాగులో నుంచి ఇసుక దిగువకు వెళ్లిపోవడం, కొంతమంది వ్యక్తులు ఈ ఇసుకను ఎత్తుకుపోవడం జరిగింది. కొత్తగా ఎగువ నుంచి వరదలు, వర్షాలు కురిసిన సమయం లో అక్కడ నుంచి వచ్చే ఇసుక వాగులో నిల్వ ఉండే అవకాశాలు కనిపించడంలేదు. ఇప్పటికైనా వాగు మరమ్మతులుపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వాగులో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గడ్డి


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

మణికేశ్వరంలో రెండోరోజు వైద్య శిబిరం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 5 : మణికేశ్వరం గ్రామంలో జ్వరాలను తగ్గించే క్రమంలో గురువారం కూడా గ్రామ సర్పంచ్ సహకారంతో వైద్యాధికారులు డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని, జ్వరం తగ్గి బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా జ్వరాలు వ్యాప్తి కాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని, కాచిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌తో పాటు సూపర్‌వైజర్లు మక్బూల్ జానీ, తబిద, కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మల్లిక, ఏఎన్‌ఎం శిరోమణి, మహాలక్ష్మి, రాజేశ్వరి, ఆశాకార్యకర్తలు వాణి, అరుణ, సుజాత, జాన్సీ, ల్యాబ్ టెన్నిషియన్ సలీం పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌పై అవగాహన


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఝాన్సీ

పంగులూరు, సెప్టెంబరు 5 : పిల్లల సమగ్ర ఎదుగుదలకు ప్రీ స్కూల్స్ ఎంతో దోహదపడతాయని, వాటి ప్రయోజనాలను తల్లులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద కోరారు. ఆరికట్లవారిపాలెంలో గురువారం ప్రీ స్కూల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పోషకాహారం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, తల్లులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పిల్లల పెరుగుదల

కారంచేడు(పర్చూరు), సెప్టెంబరు 5 : పిల్లల పెరుగుదలకు సంతులిత ఆహారం ఎంతగానో దోహదపడుతుందని సీడీపీవో ఝాన్సీ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం కారంచేడులోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లల తల్లులకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. పుట్టిన దగ్గర నుంచి ఐదు ఏళ్ల వయస్సులోపు పిల్లల పెరుగుదలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. వారి బరువు, ఆరోగ్యాన్ని తల్లులకు తెలియజేయాలన్నారు. బరువు తక్కువ పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారాన్ని, అవసరమైన వైద్య పరీక్షలు, మందులను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం


డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు, చెన్నుపల్లిలో ఉపాధ్యాయుడు శివరామ కృష్ణయ్యను సత్కరిస్తున్న సహచరులు, చినగంజాంలో హెచ్‌ఎంని సన్మానిస్తున్న వాసవీ సభ్యులు

» డాక్టర్ సర్వేపల్లికి నివాళి
» ఉపాధ్యాయులకు సన్మానం

చీరాల, సెప్టెంబరు 5 : నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం గురుపూజోత్సవాలు ఘనంగా నిర్వహించారు. టీచర్స్ డే వేడుకల్లో భాగంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులను, అధ్యాపకులను సన్మానించారు. ఆయా సందర్భాల్లో వక్తలు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. గురు స్థానానికి ఉన్న ప్రాధాన్యతను మరువరాదన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ బాబు, అడ్మిస్ట్రేటివ్ మేనేజర్ రమణమూర్తి, ఐఎస్‌టీఈ చాప్టర్ ఇన్‌చార్జి డాక్టర్ పీవీఎస్ శర్మ, అక్రిడేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్ రావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్లో క్లబ్ ప్రతినిధులు సరస్వతి దేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, మరో 13 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వి.బి.వి సత్యన్నారాయణ, బాలాజీ రామకృష్ణ, వల్లంపట్ల వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, శ్యాంసుందరరావు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను స్కూల్ మేనేజిమెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు సన్మానించారు. చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు కె.శివరామకృష్ణయ్యను హెచ్‌ఎం రవిసాగర్ ఉపాధ్యాయులు శేషగిరి, బ్రహ్మయ్య, విజయలక్ష్మి, మమత, సంధ్యారాణి సత్కరించారు. మల్లాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు గాలం వీరాంజనేయులను హెచ్‌ఎం ప్రభాకర్, సహచరులు సన్మానించారు.


జ్యోతి నిర్మలను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పర్చూరు : గురుపూజోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల బాలికలకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. చెరుకూరు జడ్పీ స్కూల్‌లో రోటరీ ఆధ్వర్యంలో 16 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

ఏలూరి శుభాకాంక్షలు

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జరుపుకుంటున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ఏలూరి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులని ఎమ్మెల్యే కొనియాడారు.

అద్దంకిటౌన్ : పాఠశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చక్రాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఉపాధ్యాయిని పూనూరి జ్యోతి నిర్మల ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన సందర్భంగా గురువారం బాపట్లలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎంపీ టి.కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, డీఈవో నారాయణరావు, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. మైలవరం జడ్పీహెచ్‌ఎస్, ఎన్‌టీఆర్ కాలనీలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు.

పంగులూరు : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఉపాధ్యాయ లోకానికి ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. నూజెళ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ మద్దినేని శోభ, హెచ్‌ఎం వీరాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినగంజాం : పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పెదగంజాం, చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదగంజాం జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం ఎం.దేవదత్తంను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం మొక్కలు నాటారు. వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు కోటా సుచిత్ర ఆధ్వర్యంలో చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్.ఎం డి.రత్నకుమారి, ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావును సన్మానించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు భయ్యా జ్యోతి, ఆర్య వైశ్య సంఘం మండల మహిళా అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి సుచిత్ర, కోశాధివారి అమరా నాగలక్ష్మి, వలివేటి లక్ష్మి పాల్గొన్నారు.



పర్చూరులో సర్వేపల్లికి ఉపాధ్యాయుల నివాళి

వరద బాధితులకు పాల ప్యాకెట్లు, మంచినీళ్లు





బాధితులకు పాలప్యాకెట్‌లు పంపిణీ చేస్తున్న అద్దంకి నియోజకవర్గ టీడీపీ నేతలు, పాలప్యాకెట్లు అందజేస్తున్న బల్లికురవ తెలుగుయువత, ఆహార వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దాతలూ సాయమందించండి

» మంత్రి గొట్టిపాటి పిలుపు
» నాలుగు రోజుల్లో రూ.కోటి విలువైన ఆహారం, పాలప్యాకెట్లు, నీళ్ల బాటిళ్ల అందజేత

అద్దంకి, సెప్టెంబరు 5 : వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు. నాలుగు రోజులుగా కోటి రూపాయలు తన సొంత నిధులతో వరద బాధితులకు ఆహార ప్యాకెట్‌లు, వాటర్‌బాటిల్స్, 90వేల పాలప్యాకెట్‌లను అద్దంకి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు విజయవాడలోనే ఉండి పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రధానంగా విజయవాడలోని సింగ్‌నగర్, రాజేశ్వరినగర్‌తో పాటు బాపట్ల జిల్లాలోని పునరావాస కేంద్రాలలోని బాధితులకు కూడా అందజేశారు. గురువారం విజయవాడలోని గొల్లపూడి, సింగ్‌నగర్, వైఎస్సార్ కాలనీలలోని బాధితులకు స్థానిక టీడీపీ నేతలు పాలప్యాకెట్‌లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు కరిపరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చాగంటి రాజేంద్ర ప్రసాద్, తేలప్రోలు రమేష్, మహేష్, వీరయ్య, వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో పంపిణీ సాగుతోంది.

బాధితులకు హలాల్ బిర్యానీ ప్యాకెట్లు

అద్దంకి, సెప్టెంబరు 5 : విజయవాడలో వరద బాధితుల కోసం అద్దంకి పట్టణంలోని హలాల్ దమ్ బిర్యానీ పాయింట్ అధినేత షేక్ బాజీ ఆధ్వర్యంలో గురువారం సుమారు 1.60 లక్షల రూపాయలతో వెయ్యి చికెన్ బిర్యానీ ప్యాకెట్లు, వెయ్యివాటర్ బాటిల్స్ పంపించారు. అద్దంకిలో ప్యాకింగ్ చేయించి ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకు వెళ్లి పంపిణీ చేశారు.

వెజిటబుల్ బిర్యానీ పంపిణీ

విజయవాడలోని వరద బాధితులకు అద్దంకి మండలంలోని వెంకటాపురంకు చెందిన రెకోమాక్స్ ఇంజనీరింగ్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్‌లు దాట్ల రత్నాకర్, సురేష్ సోదరుల ఆధ్వర్యంలో 1500 మందికి గురువారం వెజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లను విజయవాడ తీసుకు వెళ్లి పంపిణీ చేశారు. శుక్రవారం పంపనున్నట్లు తెలిపారు. దాట్ల రత్నాకర్, సురేష్, వీఆర్‌వో విజయకుమార్, చంద్రారెడ్డి, మున్నగంటి నరసింహాచారి, గొల్లపాటి వెంకటాచారి పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటి సూచనతో నేరుగా వెళ్లి అందజేసిన బల్లికురవ తెలుగు యువత

బల్లికురవ, సెప్టెంబరు 5 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు అద్దంకి నియోజకవర్గం నుంచి విజయవాడ వరద బాధితులకు గురువారం పాలప్యాకెట్లు, మంచి నీటి బాటిళ్లను తీసుకెళ్లారు. బల్లికురవ మండలం నుంచి వెళ్లిన తెలుగుయువత సభ్యులు వరద ప్రాంతంలో నీటిలో తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజల వద్దకు జీపుతో వెళ్లి వారికి మంత్రి రవికుమార్ పంపిన పాలప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో దేవినేని నరేంద్ర, అమరనేని వినోద్, అమరనేని కాశీవిశ్వనాధం, వడ్లమూడి వెంకయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో 15వేల లీటర్ల పాలు

పర్చూరు, సెప్టెంబరు 5 : విజయవాడ నగరంలో గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 15వేల లీటర్ల పాల ప్యాకెట్లను వరద ముంపు బాధితులకు అందజేశారు. భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన విజయవాడ ప్రాంతంలో మూడవరోజు గురువారం కూడా ఏలూరి ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. మరోపక్క ఏలూరి పిలుపు మేరకు నియోజకవర్గానికి చెందిన ఎన్నారైలు, దాతలు ఆహారం, వస్త్రాలు, మంచినీటి బాటిళ్లను పెద్ద ఎత్తున బాధితులకు తరలించారు.

సహాయం చేసేందుకు ముందుకొస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్పందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని, అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చీరాల పట్టణ పాస్టర్స్ ఆధ్వర్యంలో బాధితులకు దుప్పట్లు, ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్ల తదితరాలను సమకూర్చారు. అందుకు సంబంధించిన వాహనాలను గడియార స్తంభం సెంటర్ వద్ద ఎమ్మెల్యే కొండయ్య జెండా ఊపి విజయవాడకు పంపించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులు తిరిగి యథాస్థితికి వచ్చేందుకు ఎవరి వంతు తోడ్పాటు వారి అందించడం కర్తవ్యంగా భావించాలన్నారు. పాస్టర్స్ సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ పాస్టర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు

చీరాల మండల వెలుగు కార్యాలయం పరిధిలో గ్రామ సంఘాల సభ్యులు, ప్రతినిధులు సేకరించిన బియ్యం, కందిపప్పు, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లను తీసుకెళ్లే వాహనాలను ఎమ్మెల్యే కొండయ్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వెలుగు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈపురుపాలెంలో వరదబాధితులు సహాయార్థం సమాఖ్య సభ్యులు సమకూర్చిన ఆహార పదార్థాల వాహనాలను ప్రారంభించారు.

- జాండ్రపేటలో టీడీపీ నేత సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సమాఖ్య సభ్యులు, యువత ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం ఆహారపదార్థాలను పంపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, సమాఖ్యల సభ్యులు, బాధ్యులు పాల్గొన్నారు.


సహాయక చర్యల్లో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

వరదతో తీవ్ర నష్టం

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, సెప్టెంబరు 5 : విజయవాడ పరిధిలో వరద తీరని నష్టం మిగిల్చిందని, ఇది బాధాకరమని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పురపాలక కార్యాలయ పరిధిలోని అధికారులు, సిబ్బంది కమిషనర్ ఆధ్వర్యంలో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికుల సహకారంతో విజయవాడలోని మైత్రీనగర్ 5వ వార్డులో చెత్తను తొలగించడం, మురుగు నిల్వలను తరలించ డం వంటివి నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకొచ్చి సహాయక కార్యక్రమాలను నిర్వహించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఆయనవెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, హెల్త్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల పారిశుధ్య కార్మికుల సేవలు

వరద ముంపు ప్రాంతాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనుల్లో చీరాల మునిసిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం పాల్గొన్నారు. కమిషనర్ చక్రవర్తి అక్కడ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పరిస్థితి చక్కబడే వరకు అక్కడే ఉంటారని తెలిపారు.

నేడు ఉచిత గణపతి మట్టి విగ్రహాల పంపిణీ

పర్చూరు, సెప్టెంబరు 5 : వినాయకచవితి పండుగ సందర్భంగా పర్చూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం గ్రామానికి చెందిన కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు నేతృత్వంలో ఉచితంగా గణపతి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

పర్చూరు, సెప్టెంబరు 5 : వినాయక చవితి పందిళ్లు, మండపాలకు అనుమతి తప్పనిసరి అని మార్టూరు రూరల్ సర్కిల్ పరిధిలోని పర్చూరు సీఐ జీఎల్ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు ఉండాలన్నారు. నిర్వాహకుల సౌకర్యం కోసం సింగిల్ విండో విధానాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. వాట్సప్ ఫోన్ నంబర్ 7995095800కు హాయ్ అనే సందేశాన్ని టైప్ చేసి పంపితే లింకు వస్తుందని దానిని క్లిక్ చేసి దరఖాస్తు పంపించాలని సూచించారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచాలి


మాట్లాడుతున్న సెంట్రల్ టీమ్ ప్రతినిధి డాక్టర్ సంతాన్‌సేన్

పంగులూరు, సెప్టెంబరు 5 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని ఎన్‌క్వాస్ సెంట్రల్ టీమ్ ప్రతినిధి, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సంతాన సేన్ సూచించారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఎన్‌క్వాస్ సెంట్రల్ టీమ్ ప్రతినిధులు సంతాన్‌సేన్, ఎడ్వినా పెరాయిరాలు గురువారం ఎంపీడీవో, పీహెచ్‌సీ వైద్యాధికారులతో కలసి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. క్లినిక్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు డెంగ్యూ తదితర వ్యాధులు దరి చేరకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ మేనేజర్ ధన్‌రాజ్, కోఆర్డినేటర్ అనుప్రసాద్, ఎంపీడీవో రామాంజనేయులు, వైద్యాధికారులు డాక్టర్ చెన్నయ్య, డాక్టర్ బాల రాజేశ్వరిదేవి, సూపర్‌వైజర్ హరిబాబు, ఏఎన్‌ఎం జానకి, సీహెచ్‌వోలు వాణి, బిందు, విష్ణు, ఏసోబు, స్వప్నలత, పావని, శిల్ప, శిరీష, సుష్మిత, పలువురు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 5: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం అద్దంకి పట్టణంలో విజయవాడ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. భవానీ సెంటర్, బస్టాండ్ సెంటర్‌తోపాటు ఇతర ప్రాంతాలల్లో విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భర్తపై భార్య బంధువుల దాడి


గాయపడిన వీరారెడ్డి

తోటవారిపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు 5 : భర్తపై భార్య పుట్టింటి వారు దాడి చేయడంతో బాధితుడు తీవ్ర రక్త గాయాలతో ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సొమ్మసిల్లాడు. ఈఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల మండలం కావూరివారి పాలెం పంచాయతీ పాలిబోయినవారిపాలెంకు చెందిన వీరారెడ్డికి తోటవారిపాలెంకు చెందిన మహిళతో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి ఇద్దరు పిల్లలు న్నారు. ఇటీవల కుటుంబంలో నెలకొన్న వివాదాల కారణంగా భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చింది. భార్య, పిల్లలను చూసేందుకు భర్త వీరారెడ్డి తోటవారి పాలెం భార్య పుట్టింటికి వచ్చాడు. ఈక్రమంలో నెలకొన్న ఘర్షణలో మామ పోతురాజు మరి కొందరు అల్లుడిపై తీవ్రంగా దాడి చేశారు. ఈక్రమంలో బాధితుడు సమీపంలోనే ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరుగులంకించి స్టేషన్ ప్రాంగణంలోకి చేరి సొమ్మసిల్లాడు. ఎస్ఐ శివకుమార్ విషయాన్ని గ్రహించి అతడిని ముందు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

మహిళ ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ , ఎస్ఐ

ఇంకొల్లు, సెప్టెంబరు 5 : ఇంకొల్లు శివ బ్రహ్మ కాలనీకి చెందిన గోనుగుంట వేదవతి(40) సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె అంగన్‌వాడీ ఆయాగా, సాయంత్రం నుంచి పాల కేంద్రంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఆమె స్వగృహంలో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె కుమారుడు గోనుగుంట శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు చీరాల వైద్యశాలకు పంపించారు.

ఎస్ఐగా పట్టాభిరామయ్య

సంతమాగులూరు, సెప్టెంబరు 5: సంతమాగులూరు ఎస్ఐగా ఎం.పట్టాభిరామయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పట్టాభిరామయ్య సంతమాగులూరుకు బదిలీ అయ్యారు. ఎస్ఐ సురేష్ గుంటూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు.